ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

జులై 2019

సంపుటి : 25 **295** సంచిక : 7

తెలుగు కన్నడ సాహితీ అనుబంధం కొనసాగాలి!

లిపిలోనే కాదు, 'లివ్వింగ్'లో కూడా తెలుగు కన్నడ సంబంధాలున్నాయన్నారో మిత్రులు.

శతాబ్దాలుగా తెలుగు కన్నడ భాషల మధ్య మైత్రీ బంధుబంధమున్నది. తుళు వంశీయుడైన కృష్ణదేవరాయలు తెలుగు నేర్చుకుని 'ఆముక్తమాల్యద' వంటి గ్రంథాలను రచించారు.

మైసూరు విశ్వవిద్యాలయం తొలి ఉపకులపతి శ్రీనంజుండయ్యగారు, సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను అధ్యాపకునిగా నియమించారు. ఆయన కన్నడ సాహిత్య పరిషత్తు స్థాపక అధ్యక్షుడు. తళుకిన శామరాయ ఎన్నో కన్నడ గ్రంథాలను ప్రచురించారు. ముఖ్యంగా చెప్పుకోదగినది కన్నడ సాహిత్య చరిత్ర. ధర్మవరం కృష్ణమాచార్యులుగారు ఇటు తెలుగు అటు కన్నడంలో ఎన్నో గ్రంథాలను వ్రాశారు. దేవుడు నరసింహశాస్త్రిగారు రామయణ మహాపురుష, మహాబ్రహ్మన్న, మహా క్షత్రియ వంటి గ్రంథాలను రాశారు. చిలుకూరి నారాయణరావు కన్నడ పత్రికల్ని నడిపారు. ప్రజావాణి, దక్కన్ క్రానికల్ పత్రికల అధినేత నెట్కలప తెలుగువాడే! రాళ్ళపల్లి అనంతకృష్ణ ఇటు తెలుగువారికీ, అటు కన్నడిగులకు అభిమాన రచయితే! తిరుమల తాతాచార్య శర్మగారు, 'విశ్వ కర్ణాటక' అన్న పత్రికను నడిపారు. కన్నడ పత్రికా రచయితలకు ఆయన అభిమానపాత్రుడు. ఆచార్య కె. సుబ్బరాయప్పగారు మరికొందరు పెద్దలు తెలుగు కన్నడ లిపులను 'ఏకలిపి' చేయాలని చాలాకాలం ప్రయత్నించారు. విభక్తి ప్రత్యయాలు లేనిది కన్నడ భాష. 'డుమువులు' అనే పూర్ణపదాలుండవు. 'వీరకేసరి' నడిపిన సీతారామశాస్త్రి 'వీరకేసరి సీతారామశాస్త్రి'గా పేరు పొందారు.

మోటగానిహళ్ళి శంకరశాస్త్రిగారు కన్నడానికి చేసిన సాహితీసేవ ఏ కన్నడ రచయితా చేయలేదనీ చెప్పాలి. సంస్కృత గ్రంథాలన్నింటికీ కన్నడంలో టీకా తాత్పర్యములు వ్రాశారు. పాండవ విజయం, హరిశ్చంద్ర విజయ వంటి పౌరాణిక గాథలను గ్రంథాలుగా ప్రచురించారు.

జన్మత తెలుగువాడైన ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేసిన సేవలనెంతగానో కన్నడిగులు గౌరవించారు. వారి సేవలను హృదయంలో పదిలపరచుకున్నారు. ఆ రోజుల్లో శ్రీనాథకవి చంద్రుడు కర్నాటక ప్రభువులచే ఎంతగానో గౌరవింపబడ్డాడు. ఇలా చెప్పాలంటే ఎందరో ఉద్దండులు తెలుగు – కన్నడ భాషలను రెండుకళ్ళుగా చేసుకుని తరించారు. ఈనాడు కూడా ఎందరెందరో తెలుగువారు అటు కన్నడదేశానికి సేవ చేయడమే కాకుండా, స్థిరపడి, సాహిత్య, సాంస్కృతిక, వాణిజ్య రంగాల్లో కృషి చేస్తున్నారు. ప్రపంచ తెలుగు సమాఖ్య అక్కడ తెలుగు మహాసభలు జరిపినదంటే అక్కడి తెలుగు వారెందరో పట్టుబట్టి మాతృభాషాభిమానం చూపిస్తున్నారంటే తెలుగు కన్నడ భాషలపై వారికి గల సమతుల్యమైన వాత్సల్యమే! కన్నడిగులు కూడా ఈ విషయంలో సహకరిస్తున్నారంటే తెలుగు కన్నడిగులు సాంస్కృతీ సాన్నిహిత్యమనే చెప్పాలి. పంచాంగం తిథులు వంటి వాటిలో కూడా ఇరువురిదీ ఏక భావమే! ఆ ఏక భావం ఇకముందు కొనసాగాలని ప్రముఖాంధ్ర అభిలషిస్తున్నది.

భాషాసాహిత్య సాంప్రదాయాల పరిరక్షణే బాధ్యతగా
కృషి చేస్తున్న ప్రపంచ తెలుగు ప్రజల ఏకైక తెలుగు మా(న)స
పత్రికకు ఇరవై అయిదేళ్లు నిండాయ్.
ఇరవై అయిదేళ్లుగా పత్రికనందుకుంటున్న వారు రజతోత్సవ
సంబర సంచికకు యథోచితంగా అంటూ విరాళములందచేస్తే,
సంకల్పంగా గల సంచికనూ వెలువరిస్తాం.
మీ అందరి సమక్షంలో 'సంబర మహోత్సవాల్నీ'
జరుపుకుంటాం. ప్రతిపాదన మాది, ప్రతిస్పందన మీది!



బుధజన విధేయుడు

– గోటేటి శ్రీరామారావు

(జనవరి 2005 ప్రముఖాంధ్ర)

Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com
YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-



గురువులందరికీ వందనములు!

'**గురువే బ్రహ్మ గురువే విష్ణువు గురువే మహేశ్వరుడు**'– అని సనాతన ధర్మం బోధిస్తూంది. గురు ఆరాధనమునకు ప్రాధాన్యమిచ్చింది. 'తొలి గురువులు' తల్లీతండ్రీ యని తెలియచెప్పింది. తొలి గురువులైన తల్లీ తండ్రులను మరువరాదని కూడా చెప్పింది.

భారత భారతీ సాంప్రదాయమైన 'వందే గురుపరంపరాం' అంటూ ఆది గురువులైన దక్షిణామూర్తి వారికీ ప్రణతులర్పిస్తూ, భరత ఖండంలో ధర్మ సంస్థాపనా పూర్వకమైన ఏకతత్వాన్ని బోధించిన ఆది శంకరాచార్యులవారికి ముకుళిత హస్తాలతో వందన సహస్రములందచేయవలసిన అగత్యత ఎంతగానో ఉన్నది. శివకేశవ అబేధంగా ఆది శంకరుల సాహిత్యం వెలువడింది. అదే అమ్మహాగురువులోని అత్యంత ప్రతిభ.

సనాతన ధర్మాన్ని ఉపాసిస్తూ, ఉపదేశించే గురువులంటే నాకెంతో ఇష్టం. అలాటి గురువులు విన అన్యగురువులు లేరని నా పరిపూర్ణ విశ్వాసం. చక్రి సర్వోపగతుండనండీ, ఇందందు గలడని అనండి, హిందుత్వ సంపద దేవుళ్ళ, దేవాంశ సంభూతుల మయం, శివ కేశవ బేధం లేని సిద్ధాంతమే సనాతన ధర్మసారం. సర్వజీవుల మనుగడే దాని ధ్యేయం. మతంగానీ, కులంగానీ ప్రాంతపు తేడాలు గానీ లేని విశ్వ సౌభాతృత్వ విధానం ఒక్క సనాతన ధర్మంలోనే ఉంది. అది సర్వ వేదాంతాల సారం. ఈ సారాన్ని సారవంతంగా ఉద్బోధించే గురువులందరూ సద్గురువులే!

వేదం, వేదాధ్యయనపరులూ భారత దేశంలోనే పుట్టారు. భారత దేశం నుంచే సర్వశాస్త్ర సారమూ విశ్వానికి వ్యాప్తమైంది. ఏ మతం, ఏ దశమున పుట్టినా ఈ సారాన్నే సారాంశాన్నీ పునాదులుగా చేసుకుంది. అన్నిటికీ ఆదీ, మూలం సనాతన ధర్మమే! ఎవరూ కాదనలేని సత్యం!

ఏ రాజకీయ వ్యవస్థా, నాయకులూ నిజమైన భారత ధర్మాన్ని మనజుల నెరుకపరచలేదు. ఆంగ్లేయులు సహితమూ భారత సంస్కృతీ సాంప్రదాయముల్లో వేలుపెట్టలేదు. కానీ మన ప్రజాస్వామ్య పద్ధతిపై ఎన్నికయిన రాజకీయ నాయకులు ధర్మాన్ని భ్రష్టుపట్టిస్తున్నారు. కావున సనాతన ధర్మపరులైన గురువులు ధర్మసంస్థాపనకు నడుము కట్టాలి. ఆధ్యాత్మిక గురువులు వల్లనే ధర్మసంస్థాపన సాధ్యమవుతుంది.

సంసార దావానల వీఢలోక
త్రాణాయ కారుణ్య ఘనాఘనత్వమ్
ప్రాప్తస్య కల్యాణ గుణార్ణవస్య
వందే గురోః శ్రీచరణారవిన్దమ్

– ఆధ్యాత్మిక గురువొకరే భగవతీ కరుణా సాగరమునుండీ ఆశీస్సులను గ్రహించి జనులకు అందించగలుగుతారు. అడవిలోని కార్చిచ్చును కుంభవృష్టి కురిపించి అణగింప చేసినట్లు ఆధ్యాత్మికాచార్యుడు భౌతిక జీవితం మీద ఆసన్నమయ్యే కష్ట దుఃఖాలకు నివృత్తి చేయగలరు. అలాటి గురువు పాదాలకు నేను ప్రణమిల్లుతాను అన్నా శ్రీగుర్వష్టకమ్‌లో.

నేను నా మూడవ దశక వయసు నుంచీ అనేకమంది గురువులను ఆరాధిస్తూనే వచ్చాను. వారి బోధనలు విని, అభ్యాసములో పెట్టాను. 'అభ్యాస యోగయుక్తేన చేతసానాన్యగా మినా' అన్నట్లు అధ్యయనం చేసి అభ్యాసం చేస్తేనే కదా గుర్తు వుంటోంది. సన్మార్గం పథంలో నడచుకోవడానికి వీలవుతుంది. 'సదాతద్భావ భావితః' అన్నట్టు మనసులో సదా భావింపబడుతూంటుంది.

నా జీవితంలో భక్తి బీజములు నాటి సాయిబాబాపై అచంచలమైన భక్తిని కల్గించినవారు, తన కన్నుల్లో ఒకకన్నంటూ భాసించిన వారు సాయి భక్తులూ బషీర్‌బాబావారు. 'శ్రీవెంకట స్వరూప సద్గురుసాయనాథాయనమః' అని ప్రార్థించ మన్నారు. అందుకే చెన్నపట్నంలోని నా యింటికి శ్రీవేంకట సాయి నిలయము' అని నామకరణం చేయడం జరిగింది. ఏ సుమూహూర్తమున నామకరణం చేసి, గృహ ప్రవేశమయ్యానో గానీ, ఎంతోమంది మహానుభావులు, మహాభాగులు, సాధువులు, పీఠాధిపతులు అవదూతలు నా గృహాన్ని సందర్శించారు. ఆశీర్వదించారు. పుష్పగిరి పీఠాధిపతులైతే, చెన్నపట్నం వచ్చినపుడల్లా నా యింటినే తన నిలయం చేసుకున్నారు.

అలా అలా ఇంటికి విచ్చేసిన ఎందరెందరి అనుగ్రహం పొందానో, ఎందరెందరని వెళ్ళి సందర్శించానో! మధురవాణి, ప్రముఖాంధ్ర పత్రికల ద్వారా ఎందరి గురువులకు సేవలు చేసే తరించానో తలంచుకొంటూంటే ఒళ్లు ఆధ్యాత్మికతతో పులకరించి పోతుంది!

భారతదేశంలో జన్మించిన ప్రతీ ఒకరూ ఆధ్యాత్మిక చిత్తుడవుతూ తన జన్మను సార్థకం చేసుకోవాలి. అట్టి జ్ఞానాన్ని ప్రపంచమంతటనూ పంచడానికి ప్రయత్నిం చాలి.

యఃశాస్త్ర విధిముత్సృజ్య
వర్తతే కామకారతః
న స సిద్ధి మవాప్నోతి న
సుఖం న పరాం గతిం॥

–శాస్త్రోపదేశాన్ని గురుబోధల్ని పాటించకుండా, ఇచ్చ వచ్చిన రీతిని వర్తించువాడు జీవన పూర్ణత్వమును గానీ, సుఖమునుగానీ పొందజాలడన్నది నా దృఢ విశ్వాసం.

ఆధ్యాత్మిక సంపదల నిలయం భారతదేశం. దేశమంతా దైవత్వంతోనూ, ఆధ్యాత్మిక గురువులతోనూ నిండివుంది. పాశ్చాత్య దేశాల్లో కూడా భక్తి తత్వాన్ని ప్రబోధించి, ఆధ్యాత్మిక చిత్తులుగాను, సమాజ సేవా దురంధరులుగ తీర్చిదిద్దినది కూడా భారతదేశమే.

వేదములుద్భవించిన వేదభూమి, కర్మభూమీయైన భరతఖండంలో ధర్మగ్లాని గాకుండా గురువులందరూ సనాతన మార్గబోధకులు కావాలని ఆశిస్తూ ఆకాంక్షిస్తూ వందన శతములందచేస్తున్నాం.

– గోటేటి శ్రీరామారావు

శ్రీ జగద్గురు భారతీతీర్థ మహాస్వామి చరణుల ఉపదేశము

'తప్పులెన్నువారు తమతప్పులెరుగరు'



శాస్త్రములు మనము కొన్ని పదార్థములనే భుజింపవచ్చునని, కొన్నిటిని తిన కూడదని చెప్పినవి. ఇచ్చట మనము తినకూడని వాటివైపే మొగ్గు చూపుచున్నాము. శాస్త్రములు స్పష్టముగా "నాపణీయ మన్నమశ్నీయాత్" అన్నవి. (అమ్మబడుచున్న అన్నము తినవలదు) అంగళ్ళలో మాత్రమే వివిధ రకములైన తిండి వస్తువులు మనకు కావలసినవి అమ్మకమునకు సిద్ధముగా నుండును. అట్టి స్థలములకే మన కాళ్ళు త్రోవ తీయును.

శాస్త్రములు ఇట్లు ఘోషించుచున్నవి.

"మాతృవత్పరదారేషు పరద్రవ్యేషులోష్ఠవత్
ఆత్మవత్సర్వభూతేషు యః పశ్యతి స పశ్యతి ॥

తాను అగ్నిసాక్షిగా భార్యయని స్వీకరించిన స్త్రీని గాక తక్కిన స్త్రీలందరను చిత్తకల్మషము లేకుండ చూడవలెను. తనకంటె పెద్దవారిని తల్లులుగను, కొంచెమటు నిటుగ తనతో పాటు వారిని తోబుట్టువులుగను చూడవలెను. ఇట్లెంతవరకు మనము పాటించుచున్నామో మన హృదయములే సాక్షి. శాస్త్రములు నిషేధించిన వాటిపై మనకు మక్కువ మెండని చెప్పుటకిది మరియొక ఉదాహరణము.

ఈ అన్నిటిని గమనించినపుడు తోచునదిట్లుండునేమో **"ప్రాయో నేతి శ్రుతి విషయతాశ్వమాధుర్య హేతుః"** శాస్త్రములు నిషేధించిన వాటి యందే మానవులకు 'రుచి'. ఇంత గొడవ ఉండగా మనము పిల్లలను చేయగూడదని చెప్పినవే చేయు చుందురని నిందించుట సమంజసము కాదు. మనమందఱమీ నేరము చేసినవారమే.

తన తప్పులను విస్మరించి, యితరుల తప్పులను పెద్దవి చేసి చెప్పుట మానవ నైజము. తన తప్పులనొప్పుకొని సరిదిద్దుకొనుటకు మానవుడు సిద్ధపడును. తను తప్ప ఇతరులు చేసిన పనులన్నిటినీ విమర్శించుటకు మానవుడు సిద్ధము.

ఒక పర్యాయము సభయందుపన్యసించుచున్న వాడొకడు "శాస్త్రములందు విధించిన వాటిని మనవారు నానాటికి విస్మరించుచుండుట అధికమగుచున్నది. ఇట్లే సాగినచో అతి పురాతనమైన మన మతమేమి కావలెను" అనుచు యిదే ధోరణిలో మాట్లాడెను. అతడు పాశ్చాత్య వైఖరిలో దుస్తులను ధరించెను. ముఖమున తిలకధారణము లేదు. అతనికి సముచిత ప్రవర్తన యన్నగుణమే లేదన్నట్లుండెను. అతనికి మన సంస్కృతి యందున్న ప్రీతి గణనీయమైనప్పటికీ, వైయక్తికముగా అతని వర్తనలోని దోషములు కొట్టవచ్చినట్లు కన్పించుచుండెను. ఆ విషయములు వెల్లడి కావలసి యున్నది.

వేదాంతమున పెక్కు పర్యాయములు చెప్పబడు దృష్టాంగాథ యొకటి వివరింప వలసియున్నది. పదిమంది యున్న వర్గమొకటి నదిని దాటినది. పదిమంది నది దాటిరని ఒకడు కూడ వెనుక మిగిలిపోలేదని వారు నిశ్చయించుకొనదలచిరి. అందులో నొకడు మిగిలిన తొమ్మిదిమందిని లెక్కించి పదవవాడు కన్పించుటలేదని భ్రాంతి పడెను. మరియొకనిని లెక్క చూడమనెను. వాడు కూడ నట్లే చేసెను. అతనికి కూడ తొమ్మిదిమంది మాత్రమే లెక్కకు వచ్చిరి. తమలో నొకడు నదిలో మునిగిపోయినాడని, వాడు లేకుండా స్వస్థలమునకు పోవుటెట్లని వారు దుఃఖించిరి. ఆ ప్రక్కగా పోవువాడొకడు వారి దుఃఖమునకు కారణమడిగెను. వారు పదిమంది కలసివచ్చిన తమలో నొకడు నది దాటుటలో మునిగిపోయినాడని చెప్పిరి.

ఆ పథికుడు వారలతో మరల లెక్కింపుడనెను. అతడు తన్ను విడచి మిగిలిన వారిని లెక్కించి తొమ్మిదితో ఆగెను. ఆ పథికుడు వానితో "నీవే పదియవవాడవు" అని చెప్పగా వారు తామందఱు క్షేమముగా నుండిమని గ్రహించిరి. మనము మన తప్పులను వదలి యితరుల తప్పులను లెక్కింతుము. మన ప్రక్కవారు కూడా నంతే.

ప్రజలు లేకుండ సంఘము లేదు. సంఘము జడపదార్థము కాదు. ప్రజల కూటమిందు సంఘము. ప్రతివాడు తన తప్పులను సరిదిద్దుకున్నప్పుడే సంఘము తప్పులేనిదగును. మనము మన కర్తవ్యము చేయకుండ యితరులను వారి వారి కర్తవ్యములను బోధించుచున్నచో అందరు అట్లే చేయుదురు. ఇక మేలు జరుగుట యెట్లు? కావున "ప్రాయోనేన శ్రుతి విషయతా విశ్వమాధుర్య హేతుః" అన్నదాని సారము తెలిసికొనుట చాలదు. మనము తప్పు మార్గమునందున్నామని మనము గ్రహింపవలెను. అప్పుడుగాని మనము యితరుల సలహా అక్కరలేకుండా మనలను సరిదిద్దుకొనము.

ఎదురుగానున్న వస్తువు మిక్కిలి వేడిగా నున్నదని, తాకినచో చేయి కాలి పోవును. తెలిసినచో మనము దానికి దూరముగా నుందుము. తెలియనప్పుడు మనము దానిని ముట్టుకొనుటకు ప్రయత్నింతుము. మనకున్న రెండు ప్రశ్నలకు మనకు స్పష్టమైన సమాధానములు కావలెను. "మనమెచ్చటకైసాగుచున్నాము? మనమెచ్చటికి పోవుచు ఉన్నది?" ●

Lovely Stay at Holy Tirupathi *The Gateway of Lord Balaji*

HOTEL MAYURA

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation

తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు

ప్రతి మానవుని హృదయములో సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస అనే మానవతా విలువలను వికసింపచేసి తద్వారా అత్యున్నతమైన శీల సంపదను పెంపొందించి విశ్వశాంతికి కృషి చేసేలా తీర్చిదిద్దడం భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి ముఖ్యమైన అవతార లక్ష్యం. శ్రీసత్యసాయిబాబా వారు మాతృమూర్తి ఈశ్వరమ్మగారి కోరిక మేరకు నైతిక, భౌతిక, ఆధ్యాత్మిక, లౌకిక, మహోన్నత భారతీయ సంస్కృతిని, సాంప్రదాయాలను మేళవించి అత్యున్నత స్థాయిలో విద్యను అందించాలని విద్యా సంస్థలను ప్రారంభించడం జరిగింది. దైవ సంకల్పానుసారం శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయాలు ప్రపంచంలోనే అత్యున్నత స్థాయిలో నాణ్యత, శ్రేష్టత, పరిపూర్ణతగల విద్యను అందిస్తున్నాయి. ఉచిత విద్యను అందజేసే విద్యా సంస్థలు ప్రపంచంలో ఇవే అనుటలో సందేహం లేదు. నేటి సమాజంలో ఉన్న అనేక రుగ్మతలకు దివ్య ఔషధము సత్యసాయి విద్యా విధానం.

మాతృదేవోభవ, పితృదేవోభవ అని బోధించింది. వేదం. ప్రపంచంలో స్వార్ధ రహిత, నిష్కల్మషమైన ప్రేమను కేవలం తల్లిదండ్రుల దగ్గర నుండే పొందగలుగుతాము. నవమాసాలు మోసి, మృత్యువునకు భయపడకుండా తన రక్తాన్ని పాలుగా మార్చి, జన్మనిచ్చి, అనుక్షణం కంటికి రెప్పలా కాపాడుతుంది తల్లి. ఇక తండ్రి మనకు దేహమునిచ్చి బిడ్డల అభిరుచులననుసరించి అత్యున్నత విద్యనభ్యసించుటకు అనుగుణంగా తన సుఖాలను త్యాగం చేసి, తనకంటే తన బిడ్డలు ఉన్నతులు కావలెనని ఎల్లవేళలా నిష్కల్మష హృదయముతో కోరుకుంటాడు. నేడు అనేకమంది ఈ ప్రత్యక్షదైవాలను విస్మరించి దైవము కోసము అటూ ఇటూ తిరుగుతూ కాలమును వ్యర్థము చేస్తున్నారు. దైవమును దర్శించే నిమిత్తం పూజలు, పునస్కారాలు, జపములు, తపములు, తీర్థయాత్రలు, వ్రతములు మొదలైనవి యెన్నియో చేస్తున్నారు. కంటికి కనిపించని దైవము కోసం ప్రాకులాడే బదులు కంటికి కనిపించే ప్రత్యక్ష దైవాలైన తల్లిదండ్రులను బిడ్డలు పూజించాలి. ప్రేమించాలి. సేవించాలి. మనిషి తల్లిదండ్రుల ప్రేమకు నోచుకోకుండా దైవానుగ్రహానికి పాత్రుడు కాలేడు.

పుండరీకుని ఆదర్శం:

పుండరీకుడు వృద్ధులైన తల్లిదండ్రుల సేవయే జీవన పరమావధిగా భావించాడు. ఒకనాడు తాను తన తల్లిదండ్రులకు పాద సేవ చేస్తున్న సమయంలో తల్లిదండ్రుల పట్ల పుండరీకునికి గల ప్రేమను పరీక్షించదలిచి పాండురంగడు ప్రత్యక్షమయ్యాడు. కానీ పుండరీకుడు ఆయనవైపు చూడకుండా తన తల్లిదండ్రుల సేవలో నిమగ్నమయ్యాడు. పాండురంగడు, నాయనా! నేను నీకు దర్శనం ఇవ్వడానికి వస్తే నీవు నన్ను చూడకుండా ఏమి చేస్తున్నావు? అని అడిగాడు. నా తల్లిదండ్రులకు నేను సేవ చేస్తున్నాను స్వామీ అన్నాడు పుండరీకుడు. తల్లిదండ్రుల కంటే దైవము గొప్ప కదా! నన్ను ఒక్కసారి దర్శించవా? అన్నాడు పాండురంగడు. 'నాకు తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు. నా తల్లిదండ్రులు నిద్రించేంతవరకు నాకు నిన్ను దర్శించడానికి వీలుపడదు. నీవు నాకు దర్శనమివ్వాలనుకుంటే అంతవరకూ ఈ ఇటుకపై నిలుచుకో' అని చెప్పి పుండరీకుడు ఒక ఇటుకను విసిరాడు. అప్పుడు పాండురంగడు పుండరీకుని మెచ్చుకుంటూ 'నాయనా! నీ అంతటి మాతృభక్తి, పితృభక్తి ఉంటే జగత్తు ఎల్లప్పుడూ సుక్షేమంగా సౌభాగ్యవంతంగా ఉంటుంది' అన్నాడు.

శ్రవణ కుమారుడు :

తల్లిదండ్రుల పట్ల ఎంతటి అంకితభావాన్ని కలిగి ఉండాలో వాల్మీకి మహర్షి శ్రవణకుమారుని పాత్ర ద్వారా లోకానికి చాటాడు. వయసు మళ్ళిన వృద్ధ దంపతులకు జన్మించినవాడే శ్రవణకుమారుడు. వారిద్దరిని పోషించడం కోసం బాల్యం నుంచే శ్రవణకుమారుడు రాత్రింబవళ్ళు శ్రమించేవాడు. వృద్ధులయిన తల్లిదండ్రులను ఒక చోటి నుంచి మరొక చోటికి తిప్పడం కోసం వారిద్దరినీ కావడిలో కూర్చోబెట్టుకుని మోసుకుంటూ తీసుకుని వెళ్ళేవాడు. తల్లిదండ్రుల సేవ జీవిత పరమార్థంగా భావించిన విశిష్ట వ్యక్తి అతడు. ఈ విధంగా శ్రవణ కుమారుని జన్మ ధన్యమైంది. పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది.

ఏసు ప్రభువు శిలువలో వ్రేలాడుతూ కూడా తన తల్లి బాధ్యతను తన శిష్యుడికి అప్పగించారు. దీనిని బట్టి తల్లిదండ్రులను అత్యంత భక్తి గౌరవముతో చూడాలని ఏసుప్రభువు మనకిచ్చిన సందేశం. తల్లిదండ్రుల ఎడల ప్రేమ, గౌరవం లేనివాడు పుట్టినా, చచ్చినా ఒక్కటే అంటున్నాడు వేమన ఈ దిగువ పద్యంలో–

తల్లిదండ్రుల యందు దయలేని పుత్రుండు
పుట్టనేమి? వాడు గిట్టనేమి?
పుట్టలోన చెదలు పుట్టవా? గిట్టవా?
విశ్వదాభిరామ వినురవేమ

నేటి తల్లిదండ్రుల హృదయ ఘోష క్లుప్తంగా:

- వృద్ధాప్యంలో మేము వేగంగా నడవలేకపోతే చేయూత నివ్వు. మేము నీ చిటికెన వ్రేలందుకుని నడిపించామని మరచిపోకు.
- మా రోగాలకు ఖర్చుపెట్టినప్పుడు భారంగా అనుకోవద్దు. నీ అభ్యున్నతిని ఆకాంక్షించి స్వంత సుఖాలను త్యజించామని జ్ఞప్తికి తెచ్చుకో.
- నీ భవితకు చక్కటి పునాదికి నిలువెత్తు చిరునామా తల్లిదండ్రులని మరచిపోకు.
- మేము మతిమరుపునకు గురి అయితే చికాకు పడకు. సహనంతో వ్యవహరించి ఋణం తీర్చుకో.
- వయోవృద్ధులైన మమ్మల్ని బరువుగా భావించకు. వృద్ధాశ్రమంకు పంపకు. మేము కోరేది సుఖాలు కాదు. స్వచ్ఛమైన ఆప్యాయత, అనురాగం మరియు ప్రేమతో పలకరింపు.
- దేహ చక్రములో మీకూ వృద్ధాప్యం తప్పదు. మీ బిడ్డలు మీ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మీ మానసిక స్థితి ఎలా ఉంటుందో ఊహించండి.
- మాకు చివరి వీడ్కోలు మీరే పలకండి. గుర్తు చేసుకోండి మీకు ఈ లోకంలోకి స్వాగతం మేము చెప్పామని, మాకు మీరు తప్ప ఎవరూ లేరని.

ఈనాటి తల్లిదండ్రుల ఘోష నిగూఢత్వాన్ని విశదీకరిస్తే ఈ తరం పిల్లలు తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని, చిన్నచూపు చూస్తున్నారని, నిర్లక్ష్యంగా ఉంటున్నారని తేటతెల్లమవుతుంది. పత్రికల ద్వారా వెలుగులోకి వచ్చిన వార్త సమీక్షించినచో పిల్లల తల్లిదండ్రులను వదిలించుకోవడానికి ఎంత నికృష్టస్థాయికి దిగజారిపోతున్నారంటే, వృద్ధులైన తల్లిదండ్రులను నిర్దాక్షిణ్యంగా అనాథ శరణాలయాలలోనూ, వృద్ధుల ఆశ్రమాలలోనూ విడిచిపెట్టి వారి ఉనికి తెలియకుండా వెళ్ళుతున్నారు. తల్లిదండ్రులు ఉండగా వారికి పిడికెడు మెతుకులు పెట్టని ప్రబుద్ధులు కొందరు వారు పోయిన తర్వాత వారి కర్మకాండలు ఘనంగా నిర్వహించి, లోకానికి తమ ఘనత చాటుకుంటారు. ధనసంపాదన వ్యామోహంలో పడి విదేశాలు వెళ్ళి యాంత్రిక జీవితాన్ని గడుపుతూ మానవ సంబంధాలను మరుగునపడేస్తూ కృత్రిమంగా జీవించడానికి అలవాటు పడిపోతున్నారు. పట్టుపురుగు తన దారముతో తన చుట్టూ తనే అల్లుకుని చివరకు అదే తన సమాధిని నిర్మించుకున్నట్లుగా యువత, తల్లిదండ్రులు, పిల్లల మధ్య ఉన్న బాంధవ్యాన్ని విస్మరించి జీవిత పరమార్థాన్ని తెలుసుకోలేని అజ్ఞానంలో జీవిత యాత్ర సాగిస్తున్నారు. శీల నిర్మాణానికి దోహదపడే నీతి విద్య కరువైపోయింది. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా మనదైన జాతీయ విద్యా విధానాన్ని రూపొందించుకోలేకపోయాము. జాతిని నిర్వీర్యం చేసే "మెకాలే" విద్య కొనసాగడం దురదృష్టకరం.

వ్యక్తులను శీలవంతులుగా మలిచే సాధనం విద్య. దేశవైభవ చరిత్ర, ప్రాచీన శాస్త్ర విజ్ఞానం, మహా పురుషుల జీవితాలు, దేశభక్తిని, తల్లిదండ్రుల పట్ల బాధ్యత, భక్తి శ్రద్ధలు పెంపొందించే అంశాలు విద్యావిధానంలో ప్రవేశపెట్టాలి. నైతికతను సామాజిక స్పృహను పెంపొందింపజేసే పాఠ్య ప్రణాళికలుండాలి.

'నైతిక విద్యా వ్యాప్తి దేశ ప్రగతికి సోపానం' అనే పవిత్ర ఆశయాన్ని విస్మరించరాదు. భగవాన్ సత్యసాయిబాబా వారి విద్యా సంస్థలను ఆదర్శంగా తీసుకొని అనతి కాలంలోనే చర్యలు తీసుకోవడం ద్వారా నేటి యువత ఆలోచనా విధానంలో మార్పులు తీసుకొస్తారని, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతారని ఆశిద్దాం. ఆకాంక్షిద్దాం.

– డా॥ నరసింహరాజు, శ్రీవాణి సౌజన్యంతో

Compliments from
Sri Krishna Bhat
When you come to Holy Pilgrimage Centre Tirupati & Tirumala
WOOD SIDE ANNEXE
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
WOODSIDE
HOTEL WOODSIDE
E.Car Street, Tirupathi. Ph : 2284464

భారతజాతిలో ఆత్మ విశ్వాసం నింపిన స్వామి వివేకానంద

స్వామి వివేకానందను యువజనులమని భావించే ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి. మన మనస్సులో కొన్ని సందేహాలు కలుగవచ్చు. ఇయన ఈ దేశానికి ఏమి చేశాడు? ఆయనను ఎందుకు స్మరించుకోవాలి అనేది. నిజంగా ఆలోచిస్తే ఆయన జీవితం నుంచి తీసికోదగిన అంశాలు ఎన్నో. ఆయన బాల్యం - యవ్వనం - సన్యాసజీవితం - భారతదేశ సంచారం- అనుభవాలు - అమెరికా, యూరప్ దేశాలలో ఆయన సాధించిన విజయాలు- నిద్రాణమైన భారతజాతిని మేల్కొల్పటం - భారత దేశ భవిష్యత్తుకు ఆయన ఇచ్చిన సందేశం... ఇలా ఎన్నెన్నో...

స్వామీజీ బాల్యం, విద్యాభ్యాసం

ఆయన ప్రతిభ అపారం. ఆయన ఏక సంథాగ్రాహి. గొప్పగా ధ్యానం చేసేవాడు. బాగా వ్యాయామం చేసేవాడు. కుస్తీపట్టు, గుఱ్ఱపు స్వారీ కూడా వచ్చు. అద్భుతంగా పాడగలడు. తబలా వాయించగలడు.

ఆయనలోని గొప్ప గుణాలు

ఆయనకు భయమంటే ఏమిటో తెలియదు. ఎల్లప్పుడూ నిర్భయంగా ఉండే వాడు. సత్యాన్నే పలికేవాడు. కష్టాలలో ఉన్నవారిని ఆదుకోవడం, సహాయం చేయడం ఆయన సహజగుణం. ఏ విషయాన్నైనా తన అనుభవం లేనిదే నమ్మేవాడు కాదు. అన్యాయాన్ని ఎదురించేవాడు. స్వామీజీకి పిరికితనమంటే అసహ్యం. 'నేను దుర్మార్గాన్నైనా సహించగలను గాని పిరికితనాన్ని భరించలేనని' అనేవాడు.

ఆయన భారతదేశానికి ఏమిచేశాడు?

నిద్రాణమైన, నిశ్చేతనమై, అంధకారంలో, తమస్సులో మునిగివున్న భారతదేశాన్ని మేల్కొల్పినాడు. చైతన్యాన్ని కల్పించాడు. ఆత్మవిశ్వాసాన్ని నింపాడు.

ఎలా చెప్పగలం?

వివేకానందుని కాలంనాటికి భారతదేశమంతా బ్రిటీషువారి వశమైంది. వారి పాలన సుస్థిరమైనది. మనం తక్కువవారమని, మన సంస్కృతి తక్కువదని వారి కళలు, సంస్కృతి, అలవాట్లు, కట్టుబాట్లు అన్నీ గొప్పవని; మనవన్నీ పనికిరానివనే భావన మన మేధావులలో బలంగా నాటుకొని పోయింది.

విశ్వమత మహాసభ తర్వాత

చికాగో వీథుల్లో ఆయన నిలువెత్తు చిత్రాలు చోటుచేసుకున్నాయి. హైందవ సన్యాసి వివేకానంద పేరిట, వీథుల్లో పోతున్నవారు ఒక్క క్షణం ఆగి, చూచి చేతులు జోడించి ఆయనకు నమస్కరించి వెళ్ల సాగారు.

కొన్ని అంశాల్లో అగ్రగణ్యులుగా విరాజిల్లిన స్వామి వివేకానంద, చికాగో నగరాన్నే ఆయన తన పాదాక్రాంతం చేసుకున్నారు.

ప్రపంచ ప్రదర్శనశాల విజ్ఞాన విభాగపు అధ్యక్షుడైన స్నేల్ ఇలా వ్యాఖ్యానించాడు- 'స్వామి వివేకానంద ముఖతః నిజమైన హిందూమతం వారికి లభించింది. ఆయనను పంపించినందుకు అమెరికా భారత దేశానికి కృతజ్ఞతలు తెలుపుకొంటున్నది'.

సర్వమత మహాసభ అధ్యక్షుడైన డా॥ బరోస్ ఇలా అన్నాడు- 'సర్వమత మహాసభలో అసంఖ్యాకులైన ప్రజలను ఆకట్టుకున్నవారిలో ఆయన ప్రథములు'

ఇండియన్ మిర్రర్ పత్రిక ఇలా వ్రాసింది- 'నాగరికత పురోభివృద్ధి చెందిన ఆ దేశ ప్రజల కళ్ళకు నిజమైన హిందూమతం అంటే ఏమిటో ఆయన దర్శింపజేశారు. దాని విలువను వారి హృదయాల్లో పెంపొందించారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ ఒక్క మహత్కార్యం నిమిత్తమే హిందూ సమాజం స్వామివివేకానందకు కృతజ్ఞతాబద్ధమై ఉండాలి. చికాగో సర్వమత మహాసభ భారతదేశానికి, భారతీయ చింతనా ధోరణులకు లభించిన ఒక మహత్తర విజయం. అమెరికాలో ఎగసే ఒక అల భారతదేశంలో సహస్ర తరంగాలను ఉత్పన్నం చేస్తుంది. దీని ద్వారా మాతృదేశ ప్రగతికి ఆస్కారం పెరుగుతుంది'

కొందరు మహనీయుల అభిప్రాయాలు

* మీరు భారతదేశాన్ని గురించి తెలుసుకోవాలంటే స్వామి వివేకానందుణ్ణి చదవండి. ఆయన చెప్పిన ప్రతిదీ ప్రేరణదాయకం. - స్వామి
* స్వామి వివేకానందుడే ఇప్పుడు జీవించియుంటే ఇవన్నీ వదిలిపెట్టి నేను ఆయనకు శిష్యుణ్ణయి ఉండేవాణ్ణి. - సుభాష్‌చంద్రబోస్
* స్వామి వివేకానందుడే లేకపోయినట్లయితే మన హిందూమతం అంతరించి పోయి ఉండేది. - రాజగోపాలాచారి

పూజించేది రాయినా?

స్వామి వివేకానంద ఒకసారి వీరుల రాజ్యమైన రాజ్‌పుటానలోని ఆళ్వార్‌లో ఉండగా ఒక ఘటన జరిగింది. అక్కడి రాజు మంగళ్‌సింగ్‌తో స్వామీజీ మాట్లాడుతున్నప్పుడు, రాజుగారు తనకు విగ్రహారాధనపై నమ్మకం లేదనీ, అలా చేయడం రాళ్లు రప్పలని పూజించడమే అవుతుందని తెలిపారు.

వివేకానందులవారు రాజుగారి చిత్రపటాన్ని ఒకదాన్ని తెప్పించమన్నారు. మంత్రిగారిని పిలిచి దానిమీద ఉమ్మి వేయమన్నారు. అందరూ విస్తుపోయారు. మంత్రి భయపడుతూ 'స్వామీజీ! ఏమంటున్నారు మీరు? ఇది మా ప్రభువు చిత్రపటం. మేమెలా అటువంటి పని చేయగలం?' అని అన్నాడు.

అప్పుడు స్వామీజీ ఇలా బదులు చెప్పారు 'చూశారా మహారాజా! నిజానికి మీరు ఈ చిత్రంలో లేరు. ఇది కేవలం ఒక చిత్రపటం మాత్రమే. అయినా మీ చిత్రపటానికి అవమానం జరిగితే అది మీకు జరిగినట్లేనని భావిస్తున్నారు. మీ ప్రజలు, దానికి గౌరవం చూపిస్తే మీకు చూపించనట్లేననుకుంటారు వారు. చిత్రపటాలనీ, రాయినీ, చెక్కని ఎవరూ పూజించరు. అవి వారి మనస్సులలో ప్రేరేపించే దైవభావాన్ని మాత్రం పూజిస్తారు'

అంతే, ఆ మహారాజుగారు చేతులు జోడించి 'స్వామీ! ఇప్పటివరకూ నాకీ విషయమే తెలియదు. మీరు నా కళ్ళు తెరిపించారు' అన్నాడు.

- శ్రీభారతీయ మార్గము

న గురోరధికం

శివుడు, గురువు ఇద్దరూ ఒకటేనని, ఇరువురిని వేరువేరుగా చూడకూడదని, గురుగీత చెబుతోంది. అంటే సద్గురువు సాక్షాత్తూ పరమేశ్వర స్వరూపమేనని అర్థం. సంసారసాగరంలో నిరంతరం కొట్టుమిట్టాడుతూ, గమ్యం తెలియని నావలా సాగిపోతున్న మన జీవితాలకు, సరైన మార్గం చూపటానికి వచ్చిన చుక్కాని వంటివారే గురువు.

దైవ సృష్టిలో ఉన్న ఒక అద్భుతమైన అంశాన్ని వర్ణించేటప్పుడు, ఒక్కో కళాకారుడు ఒక విధంగా భావవ్యక్తీకరణ చేస్తాడు. కానీ వాస్తవానికి ఈ వర్ణనలు వేరు, ఆ అద్భుతం వేరు. అంటే వారి భావన వేరు, అక్కడ ఉన్న అంశం యొక్క యదార్థత, సహజస్థితి వేరు. ఈ భావనలేవీ ఆ అద్భుతానికి అంటవు. అటువంటి మనోవాగతీతమయిన గొప్ప అద్భుతమే, పరమసత్యమే గురువు. తేనెను తింటున్న మూగవాడికి ఆ రుచిని వర్ణించడం సాధ్యం కాదు. అలాగే గురు ప్రేమ అనే అమృతపాతంలో తడిసి ముద్దవుతున్న శిష్యుడికి, ఆ పరమానందాన్ని వర్ణించడం సాధ్యం కాదు. అది ఎవరికి వారు అనుభవపూర్వకంగా తెలుసుకోవాల్సిందే కానీ వర్ణించడానికి వీలుకాదు.

సాక్షాత్తు ఆ పరమాత్మే, ఈ భూమిపైకి రాముడు, కృష్ణుడు వంటి రూపాలలో అవతరించినా కూడా, గురువును ఆశ్రయించి, శుశ్రూష చేసి, విద్య నేర్చుకున్నారు. ఎందుకని? ప్రత్యక్ష దైవమైన వారికి ఒక గురువును ఆశ్రయించాల్సిన అవసరం ఏముంది?

ఎందుకంటే, మానవులకు గురువు యొక్క ప్రాముఖ్యతను తెలియజేసేందుకే, దైవం కూడా ఒక గురుకులంలో చేరి, గురువును ఆశ్రయించి వారికి శుశ్రూష చేశారు. గురువు పట్ల మన నడవడి ఎలా ఉండాలో ఆచరించి చూపారు. ఈ లోకంలో మనం ఎన్నో పనులతో వ్యస్తంగా ఉంటూ పరుగులు పెడుతూ ఉంటాము. ఆ తొందరలో ఏదైనా వాయిదా వెయ్యాలంటే, మొట్ట మొదట మనకు గుర్తుకు వచ్చేవి పూజ, ఆరాధన, గురుసేవ. కాని గురువు నియోగించిన పని పట్ల అనురక్తిని కలిగి ఉండి, దానికే తొలి ప్రాధాన్యతను ఇచ్చినప్పుడు, మన తక్కిన పనులన్నీ వాటికవే పూర్తవుతాయట. ఇదే విషయాన్ని ఎంతో మంది గురు భక్తుల కథలు మనకు తెలియజేస్తాయి. అటువంటి కొన్ని గాథలను ఈ గురుపౌర్ణమి సందర్భంగా పునశ్చరణ చేసుకుందాము.

సనందుడు ఆది శంకరాచార్యుల వారిని ఆశ్రయించి, అంకిత భావంతో గురుసేవ చెయ్యసాగాడు. శంకరాచార్యులవారు తమకంటే కొత్తగా వచ్చిన సనందుని పట్ల ఆదరాభిమానాలను చూపడం తట్టుకోలేక, అసూయ చెందారు మిగతా శిష్యులు. అప్పుడు శంకరులు, వారికి సనందుడి గురుభక్తి యొక్క మహిమను చూపదలచి, నదికి ఆవలి ఒడ్డున ఉన్న సనందుడిని పిలిచారు. గురువు పిలిచారన్న ఆతృతలో, మధ్యలో నది ఉందన్న విషయాన్ని కూడా గమనించకుండా, సనందుడు నీటిపై పరుగులు తీయగా, అతడు మునిగిపోకుండా, అతను పాదం వేసిన చోటల్లా నీటిలో ఒక పద్మం మొలిచింది. అలా సనందుడు పద్మపాదుడయ్యాడు. ఆ తర్వాత నృసింహోపాసనతో స్వయంగా గురువునే కాపాడగలిగిన ఘనుడయ్యాడు. ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలకు భాష్యాలు రాసాడు.

వేదధార్యుడు అనే గురువును ఆశ్రయించిన దీపకుడు అనే శిష్యుడు అంకిత భావంతో గురుసేవ చేయసాగాడు. అతడి గురు భక్తిని పరీక్షించ దలచిన వేదధార్యుడు, తాను గత జన్మ కర్మలను అనుభవించాల్సి ఉందంటూ, లేని కుష్టురోగాన్ని అరువు తెచ్చుకుని, దీపకుడితో సహా కాశి పయనించాడు. ఘోర రూపంతో గుడ్డివాడై, దేహమంతా పుండ్లు పడి, చీము కారుతుండగా, కుష్టురోగంతో ఉన్న గురువును దీపకుడు బిచ్చమెత్తి పోషించేవాడు. ఆయన కసిరినా, విసిరినా ఆయన పుండ్లను మలమూత్రాదులను అత్యంత శ్రద్ధతో శుభ్రం చేసేవాడు. అతడి గురుభక్తికి మెచ్చి, స్వయంగా కాశీ విశ్వేశ్వరుడితో సహా సమస్త దేవతలు అతనికి వరమిచ్చేందుకు ప్రత్యక్షమయ్యారు. కానీ దీపకుడు తనకు అచంచలమైన గురుభక్తే చాలంటూ, వారిని ఏ వరాలూ కోరేందుకు నిరాకరించాడు. చివరకు గురువు దీపకుడి భక్తికి ప్రసన్నుడై, అతడిని అనుగ్రహించారు.

ధౌమ్యుడనే గురువు యొక్క శిష్యులు అరుణి, బైదుడు, ఉపమన్యుడు. వీరిలో అరుణి గురువు గారి ఆజ్ఞ ప్రకారం పొలంలోకి చొచ్చుకు వస్తున్న నీటిని అదుపు

చేయడానికి, వేరే మార్గం లేక, రాత్రంతా తానే అడ్డుకట్టగా పడుకుని, గురువు అనుగ్రహానికి పాత్రుడయ్యాడు. బైదుడు గురువు యొక్క వ్యవసాయ క్షేత్రాన్ని సాగు చేస్తూ, కాడెద్దులు కుంటుపడగా, తానే బండిని లాగుతూ సొమ్మసిల్లి పోయి, చివరికి గురువు దయవల్ల దీవించబడ్డాడు. ఉపమన్యువు గురువు ఆజ్ఞపై ఆహారాన్ని వీడి, ఆకులు తిని బతుకుతూ, గుడ్డివాడై బావిలో పడి, గురువు యొక్క కృప వల్ల, అశ్వినీదేవతల అనుగ్రహంతో, తిరిగి ఆరోగ్యవంతుడై, ఏమీ చదవకుండానే సమస్త విద్యలను పొందాడు. అంతేకాదు అనంతర కాలంలో ఉద్దాలకుడు అనే గొప్ప శిష్యుడికి గురువయ్యాడు.

అధ్యాపకుడు వేరు, గురువు వేరు. చాలామంది ఈ ఇరువురికీ ఉన్న భేదం తెలియక టీచర్స్ డే నాడు గురువును, గురుపౌర్ణమినాడు అధ్యాపకులను పూజిస్తూ ఉంటారు. విద్యాబుద్ధులు చెప్పి భౌతికంగా బ్రతకడానికి ఆలంబన ఇచ్చేవారు అధ్యాపకులయితే, క్లిష్టమైన ఆధ్యాత్మిక పథంలో పయనించడానికి పూతమిచ్చి, శిష్యుడిని పరమాత్మ వైపు నడిపించే వారు సద్గురువు. ఒక గుడ్డివాడు మరొక గుడ్డివాడికి దారి చూపలేనట్లు, ఆత్మజ్ఞానం లేనివారు మరొకరికి ఎలా దారిని చూపగలరు? అందుకే ఆత్మజ్ఞానం పొందాలంటే మనం సద్గురువును ఆశ్రయించాలి, అధ్యాపకుడిని కాదు.

సరైన సద్గురువు దొరకాలంటే, విజ్ఞులు గురుచరిత్రను పారాయణం చేయమని చెబుతూ ఉంటారు. కానీ నేటి బూటకపు సమాజంలో సరైన సద్గురువు దొరుకుతారా అని చాలా మందికి సందేహం కలగవచ్చు. 'గడ్డిపరక నైనా గురువుగా భావించమని, నమ్మికతో పూజించమని,' చెబుతారు షిరిడి సాయి బాబా. ఆయన ఇలా ఎందుకు అన్నారంటే, ఇక్కడ గురువు మీద ఉన్న గురే(విశ్వాసమే), శిష్యుడికి సరైన మార్గాన్ని చూపటంలో ప్రధాన పాత్రను పోషిస్తుంది. ఉదాహరణకు ఏకలవ్యుడు ద్రోణాచార్యుడి విగ్రహాన్ని తయారుచేసి, ఎదురుగా పెట్టుకొని, ఆ విగ్రహాన్ని తన గురువుగా భావిస్తూ, సమస్త విద్యలను పొందగలిగాడు. నేరుగా ద్రోణాచార్యుడి వద్ద విద్యను అభ్యసించిన అర్జునుడి కంటే గొప్ప విలుకాడు అయ్యాడు. ఈ కథ మనకు గురువు మీద శిష్యుడికి ఉన్న నమ్మకమే, ఎటువంటి అద్భుతమైనా చెయ్యగలదని నిరూపిస్తుంది.

ఒక్క గురువును పొందగలిగితే, వారు ఈ సమస్త సృష్టిలో పొందలేనిది ఏదీ ఉండదు. గురువే కామధేనువు, కల్పవృక్షం వంటివారు. చండాలుడి తో వేదం చెప్పించారు దత్త భగవానులు. చాకలిని రాజును చేశారు శ్రీపాద వల్లభ ప్రభువు. నరహరిశర్మ యొక్క కుష్టురోగాన్ని తీసివేశారు నృసింహ సరస్వతి స్వామి. ఈ దత్తుడే మాణిక్య ప్రభువుగా, అక్కల్ కోటలో స్వామి సమర్థగా, షిరిడి సాయి బాబాగా, ఇలా అనేక రూపాల్లో, అనేక మార్లు, కేవలం మానవాళి పట్ల ఉన్న అవ్యాజమైన ప్రేమతో, వారిని ఉద్ధరించాలన్న సంకల్పంతో మళ్లీ మళ్లీ ఈ పవిత్ర భారతావనిలో అవతరిస్తూ ఉన్నారు.

గురు కృపకు పాత్రులు కాగలిగితే, ఇక వారికి ఏ లోటూ ఉండదు. శిష్యుడి ఆకలి దప్పికలను, అవసరాలను గమనిస్తూ అనుక్షణం కంటికి రెప్పలా కాచుకునే ఉంటారు గురువు. సంరక్షణలో తండ్రిని, పోషణలో తల్లిని మరిపిస్తూ, తన శిష్యుడికి అన్నింటిని మించిన గొప్ప బంధం తానే అవుతారు. శిష్యుడి లో అహంకారం చెలరేగి, ఆత్మజ్ఞాన పథానికి దూరమైనప్పుడల్లా గమనించి, వెంటనే అతడిని తిరిగి దారిలో పెడతారు. తన శిష్యుల కర్మలను తాను స్వీకరించి, ఆ కర్మ నివృత్తి చేసుకునేందుకు అనేక విధాల బాధలను స్వయంగా అనుభవిస్తూ ఉంటారు. అనేక జన్మల పాటు శిష్యుడి వెన్నంటే ఉండి నడిపిస్తూ, చివరికి ఆ జీవాత్మ

భోజనప్రియులకు మాత్రమే!

సాంబారులో చందమామలు

తెలుగువాడు మంచి భోజనప్రియుడని వేరే చెప్పవలసిన పనిలేదు. మన విస్తరిని ఉత్తరాది భోజనాలతో పోల్చి చూస్తే, ఎవరికైనా ఆ విషయం తెలిసిపోతుంది. అభిరుచుల్లో వైవిధ్యాన్ని గమనిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. 'ఆవకాయ రుచుల రీవి తానెరుగును, పూతరేకు తీపి కేతమెత్తు, ఉలవచారు త్రావ ఉత్సాహమును జూపు, పనసపొట్టు నొక్క పట్టుబట్టు!...' వాడెవడని అడిగితే జవాబు కోసం తడుముకునే అవసరం రాదు. కనుకనే దేశదేశాల్లో తెలుగు రుచులు నేడు రాజ్యం ఏలుతున్నాయి. వైద్యులు కాదంటున్నా, 'వరితో చేసిన వంటకంబు రుచియై వార్ధక్యమును బాపదే' అంటూ మధుమేహులు వాదనకు దిగుతారు. భక్ష్య భోజ్య లేహ్య చోహ్య పానీయాలకు భోజనంలో భాగం కల్పించిన ఘనత తెలుగువాడిది. మామిడిపండుతోనో, మాగాయ టెంకతోనో 'గడ్డపెరుగు నింత గారాబమును చేసి' గగ్రున తేన్చి, ఆ పూటకు భోజన పరాక్రమానికి స్వస్తి చెప్పడం వేరే వాళ్ళకు చేతకాదు. 'కడుపే కైలాసం' వంటి నానుడిని పుట్టించడం తెలుగువాడికి మాత్రమే సాధ్యం. కాబట్టే పరభాషల్లో అలాంటి పదబంధాలు కనపడవు. సరైన భోజన సదుపాయం దొరక్క 'చల్లా నదిబలి త్రావితిన్ రుచులు దోసంబంచు పోనాడితిన్ తల్లీ! కన్నడ రాజ్యలక్ష్మీ! దయలేదా, నేను శ్రీనాథుడన్' అని అదేదో ఘనకార్యంలా ఫిర్యాదు చేశాడంటే శ్రీనాథుడు తెలుగువాడు కాబట్టే! కొరవి గోపరాజు 'సింహాసన ద్వాత్రింశక'ను గాని, పాలవేకరి కదిరీపతి 'శుకసప్తతి'ని గాని తిరగేస్తే తెలుగువారి భోజన పదార్థాల పట్టిక పట్టరాని విస్మయాన్ని కలిగిస్తుంది. చేపలను జలపుష్పాలు గాను, గోంగూరను శాకంబరీమాత ప్రసాదంగాను చమత్కరించడం తెలుగు నాలిక్కి మాత్రమే పట్టుబడే విద్య. ఏ గిరీశాన్నో నిలదీస్తే 'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అన్న వాడు ఆంధ్రుడే– అని ఠక్కున చెబుతాడు. 'చద్దీ వణ్ణం' తినడానికి అభ్యంతరం లేదని బుచ్చెమ్మకు అందుకే గట్టిగా చెప్పగలిగాడు.

మహాభారతంపై మమకారాన్ని ప్రకటిస్తూ 'వింటే భారతమే వినాలి' అని వూరుకుంటే– తెలుగువాడు ఎందుకవుతాడు? 'తింటే గారెలే తినాలి' అంటూ తన జిహ్వాచాపల్యాన్ని జోడించడం తెలుగువాడికే చెల్లింది. 'గారెలు తిందు నేను వడగాచిన నేతిని ముంచుకొంచు' అనడం ఒకరి అభిరుచి విశేషం. తేనె పానకంలో నానబెట్టి 'పాకం గారెలు'గా తినడం మరొకరికి ఇష్టం. 'ఆ సుధారసంబునందు వూరిన గారెలు ఇచ్చు పరితుష్టికి పుష్టికి సాటిలేదిలన్' అనేది వీరి అభిప్రాయం. ఈ వేళంటే కంగాళీ తిళ్ళు(ఫాస్ట్‌ఫుడ్స్) వచ్చిపడి తెలుగువాడి తిండిపుష్టి ఇలా ధ్వంసం అయిందిగాని, మన పెద్దల తిళ్ళు గుర్తుచేసుకుంటే మనం ఎంత అర్భకులమో తెలిసొస్తుంది. అలా పెట్టి, తినీ ఆస్తులు కరగదీసిన జాతి మనది! తరవాణీల బలం– కాఫీ, టీలకు రమ్మంటే ఎలా వస్తుంది? 'అరుణ గభస్తి బింబము ఉదయాద్రి పయిం పొడతేర గిన్నెలో పెరుగును, వంటకంబు వడపిండియలతో' చల్దులను పిల్లలకు ఎలా తినిపించేవారో కృష్ణదేవరాయలు 'ఆముక్తమాల్యద'లో వర్ణించాడు. 'మాటిమాటికి వ్రేలు మడిచి వూరించుచు వూరుగాయలను' గోపబాలకులు ఎలా ఇష్టంగా ఆరగించారో భాగవతంలో పోతన వర్ణించాడు. ఈ చద్దన్నాలకు, ఆ పానీయాలకు పోలికే లేదు. కాఫీ, టీల మూలంగా మంటపుట్టిందే తప్ప 'కడుపులో చల్ల కదలకుండా' హాయిగా తిని కూర్చోవడం మనకు వీలుకావడం లేదు. ఆ రోజుల్లో వడ్డనలూ భారీగానే ఉండేవని కల్పవృక్షంలో విశ్వనాథ పేర్కొన్నారు. దశరథుడి అశ్వమేధయాగ సంతర్పణలో ఎన్నో రకాల వంటకాలు సిద్ధంచేసి 'హస్తములు అడ్డముంచినను ఆగక వడ్డన చేసిరన్నియున్' అని వర్ణించారు. విస్తరిపై వంగి వద్దు వద్దంటే కడుపులో ఇంకాస్త చోటున్నట్లట! బొజ్జ వంగక కళ్ళతోనే నిస్సహాయంగా సైగలు చేస్తే ఇక చాలు అని ఆగేవారట. తెలుగువాడి భోజనప్రీతిని వెల్లడించే ఉదాహరణలివన్నీ. వూరుగాని వూరు పోతే ముందస్తుగా 'మంచి భోజనమ్ము మర్యాదగా పెట్టు పూటకూళ్ళ యిళ్ళ వేట'లో నిమగ్నం కావడం గతంలో తెలుగువాడి ఆనవాయితీ.

వండటం వడ్డించడం తినడంలోనే కాదు– ఆరోగ్యం విషయంలోనూ తెలుగు వాడి అభిరుచి ప్రత్యేకమైనదేనని మళ్ళీ కొత్తగా నిరూపణ అయింది. ఇడ్లీ తెలుగువాడికి చాలా ఇష్టమైన పదార్థం. 'ఇడ్డెనల్' అనేది అటు కవుల ప్రయోగాల్లోను, ఇటు నిఘంటువుల్లోను కనిపించే అచ్చతెనుగు పదం. 'చినచిన్న చందమామలు నునుమల్లెల మెత్తదనము నోటికి హితమౌ, జనప్రియములు రుచికరములు– ఇడ్డెనలకు ఎనయైన భక్ష్యమేది ధరిత్రిన్' అని బులుసు వేంకటేశ్వర్లు కవి చెప్పినట్లు తెలుగువారు 'తినుచున్న ఇడ్డెనలు తినుచుంద్రు నిత్యము' అనిపిస్తుంది. పిండిని ఉడకబెట్టి ఆవిరిపై వండే పదార్థాన్ని 'ఇడ్లి ' అంటారు. దాన్నే పనస ఆకుల మధ్య ఒబ్బిడిగా ఉడికిస్తే– అది పొట్టిక్కబుట్టి! ఆషాఢ మాసపు చివరి రోజుల్లో కడుపులో పెరిగే క్రిముల నివారణకు పనసాకులతో సహా ఉడికే పొట్టిక్కబుట్టలోని ఆహారం దివ్య ఔషధం! సాధారణ ఇడ్లీకి సాంబారు చక్కని జత. 'సాంబారులో స్నానం చేస్తున్న ఇడ్లీ సుందరి' ఓ సందర్భంలో శ్రీశ్రీ కవితలో మెరిసింది. 'ఉదయంపూట ఆహారంగా తినే ఇడ్లీ ప్రపంచంలోని ఆహార పదార్థాలన్నింటికన్నా ఆరోగ్యకరమైనది' అని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. ఆ మేరకు యునెస్కో డైరెక్టర్ జనరల్ ఇరినా బొకోవా సంతకంతో జారీ అయిన యోగ్యతాపత్రం ఇటీవల సామాజిక మాధ్యమాల్లో ప్రాచుర్యం పొందింది. లక్షలమంది ఆ విశేషాన్ని ఒకరితో ఒకరు 'పంచు'కుంటున్నారు. ఈ సంగతి తెలియగానే 'ఇడ్డెనతో సాంబారును గడ్డపెరుగుతోడ ఆవకాయయు జతగా...' హాయిగా లాగిస్తూ మన పూర్వీకులు 'సొద్దుసుమీ స్వర్గలోక సుఖముల కెల్లన్' అనుకుంటూ ఆరోగ్యంగా జీవించారని కవులు కీర్తించడం మొదలెట్టారు. ఐక్యరాజ్య సమితి పుణ్యమా అని మన వంటకానికి అంతర్జాతీయ గుర్తింపు దక్కడం ఆంధ్రులకు గర్వకారణమని వారి ఆనందం!

– సుగుణ రూపనగుడి

పరమాత్మలో లయం చేసే దాకా దారి చూపుతారు. అటువంటి మహనీయులయిన సద్గురువులు, యోగులు, మునులు అదృశ్యరూపంలో మనకోసం ప్రార్థిస్తూ, పదే పదే ఎంచుకుని మరీ ఇక్కడే జన్మించే పవిత్ర భారతావని మనది. వారందరూ చేస్తున్న నిస్వార్థమైన సేవకు ఈ గురు పౌర్ణమి సందర్భంగా మన సాష్టాంగ నమస్కారాలు సమర్పిద్దాం.

న గురోరధికం, న గురోరధికం, న గురోరధికం!

ఇతి శివ శాసనతః. జై గురుదత్త.

– భావరాజు పద్మిని

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

Beautiful City - Beautiful Hotel

Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

సాహో జంధ్యాల పచ్చళ్ళూ



జంధ్యాల పచ్చళ్ళ విశిష్టతపై, సినిమాల్లో శ్రీలక్ష్మి గారి హాస్య పాత్రలతో అల్లిన ఓ సరదా వ్యాసం.

'బాబు చిట్టీ, ఇలా రామ్మ, నేనమ్మా మీ కాంతాన్ని. ఏమన్నావు, నాన్నా, ఏమన్నావు? జంధ్యాల వాళ్ళ పచ్చళ్ళకు సాటి లేదన్నావా? ఆ రుచి, ఆ కమ్మటి వాసన చవులూరిస్తుందన్నావా? మా చిట్టి కూడా ఇలాగే అనేవాడు. ఏది ఒకసారి ఇటురా బాబూ... టటటటటై...'

'అరె, పిన్నిగారు, ఏవిటిది, వదలండి, ఇంకెప్పుడు అలా అనను... వది లెయ్యండి.'

'అనకపోతే ఎలా చిట్టీ, తిని ఊరుకునే పచ్చళ్ళా అవి? మన అమ్మమ్మల్ని, బామ్మల్ని గుర్తుకుతెచ్చే అద్భుతాలు కదూ. నువ్వా పచ్చళ్ళ గురించి అందరికి చెబుతానంటేనే వదులుతాను. సరేనా?'

'అలాగే కాంతం పిన్ని...' **(జయమ్ము నిశ్చయమ్మురా – కాంతం)**

* * *

'అయినా వేడివేడి అన్నంలో ముద్దపప్పు, ఆవకాయ కలుపుకుని, బాగా నెయ్యేసి తినడం మీద మీ అభిప్రాయం ఏమిటి? అహ, ఏవిటని అడుగుతున్నాను. అది కూడా అలాంటిలాంటి ఆవకాయ తింటే కాదు చిట్టీ, జంధ్యాల ఆవకాయే తినాలి. అప్పుడుంటుందీ, ఆహా నా రాజా! స్వర్గానికి అరంగుళమే దూరమంటే నమ్ము.

'ఏం కాదు నువ్వు పొరబడుతున్నావు మండోదరీ! అసలు జంధ్యాల వారి చింతకాయ పచ్చట్లో ఇంత మంచినూనె అంత వెన్న వేసుకు తింటే ఉంటుంది చూడు! మహాప్రభో, ఇంగువ ఘాటు, చింతకాయలలో ఉండే చిరుతీపి, వగరు, కారం అన్నీ కలిపి మరపించి, జివజచ్చిన జిహ్వాకి జీవమొస్తుందంటే నమ్ము. అలాంటి చింతకాయ ఇక ఎక్కడా దొరకదంటే నమ్ము.'

'ఇదిగో, నువ్వు తెలియక మాట్లాడుతున్నావు. అసలు పెసరకట్టులో జంధ్యాల వారి నిమ్మకాయ ఊరగాయ, పేరిన నెయ్యి వేసుకు తింటే ఉంటుంది చూడు... ఓహో, అచ్చ తెలుగు విందు భోజనం అంటే నమ్ము.'

'నువ్వు ఎన్నైనా చెప్పు మండోదరి, అసలు జంధ్యాల వారి గోంగూర పచ్చడి ఉంది చూసావు... వేడన్నంలో నెయ్యేసుకు కలిపి, నాలుగు ముద్దలు నాలుకను తాకాయంటే, నవనాడులూ స్పందించి పరవశించిపోతాం తెలుసా?'

బామ్మ – 'వీళ్ళిద్దరూ ఇలా రోజంతా జంధ్యాల పచ్చళ్ళ గురించే మాట్లాడుకుంటూ ఉంటే, ఇక కాపురం చేసేదెప్పుడు, నా ఒళ్లో మనవడిని వేసుకుని ఆడించేదెప్పుడు? భగవంతుడా ఏవిటి చెయ్యడం?'

(చూపులు కలిసిన శుభవేళ– మండోదరి)

* * *

ఎడిటర్ గారు, నమస్తే అండి. నా పేరు వాగ్దేవి. నేను జంధ్యాల వారి పచ్చళ్ళపై ఓ కొత్త తవిక రాసుకొచ్చాను. వినండి.

జంధ్యాల వారి పచ్చళ్ళు
రుచిని దంచికొట్టే రోకళ్ళు
చలేస్తే కప్పుకున్న కంబళ్ళు
చిన్నప్పుడు తిన్న గుగ్గిళ్ళు
చెయ్యండి బాగా కొనుగోళ్ళు.

ఎడిటర్:

ఇది విని వస్తున్నాయి ఎక్కిళ్ళు
అయినా నాకెందుకొస్తాయి వేవిళ్ళు
పెట్టించకమ్మా నాతో కన్నీళ్ళు
వచ్చిన దారినే తిరిగెళ్ళు.



కుటుంబ సభ్యులతో జంధ్యాల రామకృష్ణ



'అరె, ఎడిటర్ గారు, ఇది కూడా బాగుంది. నా తవికకు కలుపుతా ఉండండి. ఈలోగా నేను చేసిన ఈ కొత్తవంటకం 'కందిమాగా' తినండి.

'ఏవిటీ కందిమాగా నా?'

'కాదండి మనుషులు తినేదే. అంతా ఆ జంధ్యాల వాళ్ళ కందిపొడిని, మాగాయను పొగుడుతుంటే, నాకూ అనలీ రెండూ కలిపి కొట్టి నా ప్రతిభను చూపించాలనిపించింది. అందుకే చేసాను. తినండి, తినండి.'

తిన్నాక, 'అసలు నేను తింటాననేగా జంధ్యాల వాళ్ళు పచ్చళ్ళు పెట్టడం మొదలెట్టింది. మరా వాస్కోడిగామా అలా అంటాడేమిటి? అయినా ఆ ఐన్ స్టీన్ చెప్పినట్టు తెల్లవాడు ఉట్టి వెర్రివాడోయ్. మన దేశంనుంచి పోయేప్పుడు నూరుకోవ దానికి కోహినూరు వజ్రం పట్టుకుపోయాడు కానీ కుంకాక్కి, ఈ జంధ్యాల పచ్చళ్ళు పట్టుకుపోయుంటే, వాడి జన్మ ధన్యమైపోయేది. ఎవరక్కడ, నా టూ వీలర్ ను ట్రాఫిక్ పోలీసు లారీ మీద తీసుకురండి. నేను ట్రాఫిక్ జామ్ లేకుండా వెంటనే హబ్సీగూడ వెళ్ళి, నూనెలో వెయ్యగానే అరచెయ్యంత ఉబ్బే జంధ్యాల వారి గుమ్మడికాయ వడియాలు కొనుక్కోవాలి.'

'చూసావా బాబూ, నా వంటకం తినగనే ఎంత జ్ఞానమొచ్చిందో. నువ్వూ తిను.'

అంతా మాయమైపోతారు. డింగ్.

(వాగ్దేవి – చంటబ్బాయ్)

* * *

'హారతి గైకొనుమా ఓ వేంకటేశ్వరా, ఓ ప్రత్యక్షదైవా, ఓ శ్రీలక్ష్మీ మాతా, ఓ ప్రత్యక్షా దైవా!'

'అఖిలం, ఇలా నువ్వు రోజంతా నేను, ఆ దేవుడు మాడి మసైపోయేలా హారతులిస్తూనే ఉంటావా లేక ఏమైనా పెట్టేదుందా? రాముడునే కాదే కాస్త నా ఆత్మారాముడి ఘోష కూడా పట్టించుకోవే...'

'ఆ, ఆ తొందరపడకండి. ముందీ హారతులు అయిపోనివ్వండి. ఇవాళ మీ భోజనంలో స్పెషల్ ఏవిటో తెలుసా. జంధ్యాల పచ్చళ్ళు..'

'ఏవిటీ, బయటి పచ్చళ్ళా, నేను తినను బాబు! వెజిటబుల్ ఆయిల్, వెల్లుల్లి, వెనిగార్ అన్నీ వేసి చేస్తున్నారట చవటాయిలు. నేను తినేనే అఖిలం. ఈ పూటకు ఏ అటుకులో ఇవ్వు సర్దుకుంటా.'

'ఇదిగో తినబోతూ రుచులడిగినట్టుంది మీ సంగతి. జంధ్యాల వాళ్ళని, ఆ జెడ్డి ఊరగాయలు పెట్టే వాళ్ళతో పోలిస్తే ఏడు రోజులు సప్తాహ హారతిస్తా జాగ్రత్త! ఏ ఊరగాయకైనా ఉత్తమమైన కాయ ఏ ఊళ్ళో దొరికితే ఆ ఊరు వెళ్ళి మరీ తీసుకొస్తారు. కారంకోసం మిరపకాయలు ఎంచుకుని మరీ దంపిస్తారు. చింతకాయ, కొరివికారం లాంటివి రోట్లో తొక్కిస్తారు. నూనె, ఉప్పు, ఇంగువ, ఇలా దేని విషయంలోనూ రాజీ పడకుండా చేస్తారు. వెల్లుల్లి ఊరగాయలు కావాలంటే ఆర్డరిస్తే చేస్తారు కాని, అన్నింట్లో వెయ్యరు. ముఖ్యంగా నిలవుంచడానికి ఎలాంటి రసాయనాలు కలపరు. అందుకే జంధ్యాల పచ్చళ్ళలాంటి రుచి ఇంట్లో మనం ఊరగాయ పెట్టుకున్నా రాదంటే నమ్మండి.'

లలితా వెంకటేశ్వరరావుల ఆవకాయ పదనిసలు

నేను మా ఆవిడతో కలిసి ఆవకాయ, మాగాయ పెట్టడం గత 30 ఏళ్ళుగా జరుగుతోంది. మా ఇంటిలో మావిడిచెట్టు వయస్సు ఓ 40 సంవత్సరాలుంటుంది. ఆ చెట్టుకి 365 రోజులు మామిడికాయలు కాయడం ఒక ఎత్తయితే, అవి అత్యంత పుల్లగా వుండడం రెండో వింత. రోడ్డులో వెళ్ళే ఆకతాయి పిల్లలు ఆ కాయల కోసం రాళ్ళు విసిరినప్పుడల్లా మా కిటికీ తలుపులు (నా బెడ్‌రూమ్ చెట్టు పక్కనే) కున్న అద్దాలు మార్చినప్పుడు కూడా ఆ చెట్టుని తీసేద్దాం అనే ఆలోచన రాలేదు. ఆ చెట్టు కొమ్మలు చాలావరకు పక్కింటిలో వుండేవి, వారు ఆకులు ఎండిపోయి మా ఇంటినిండా పడుతున్నాయి అని కంప్లైంట్ ఇచ్చినప్పుడు దానికోసం ప్రత్యేకంగా ఒక పనిమనిషిని పెట్టి శుభ్రంగా వారానికి రెండుసార్లు చక్కగా ఊడ్పించి వారి మనస్సుని శాంతింపచేసేవారం. ఇవన్నీ ఎందుకు చెపుతున్నానంటే ఆ చెట్టు కాయలే మా ఇంటిల్లిపాదికి – కాదుకాదు చుట్టాలు స్నేహితులకు కూడా సంవత్సరానికి సరిపడా ఆవకాయ, మాగాయలకు వాడేవారం. కాయలు చెట్టు ఎక్కి కొయ్యడం, వాటిని చక్కగా తడిగుడ్డతో తుడిచి, మళ్ళీ తడి లేకుండా పొడి గుడ్డతో తుడిచి, వాటిని టెంక వుండేటట్లుగా ముక్క కొట్టించుకుని వచ్చి, మళ్ళీ టెంకకున్న జీడిని తీసేసి, ఉల్లిపొరలాగ వున్న టెంకపై పాయను తియ్యటం, ఆవకాయ కారం, ఆవపొడి ఆడించుకుని వచ్చి, నూనె గానుగకు వెళ్ళి కొనుక్కుని వచ్చి అవన్నీ కలుపుతున్నప్పుడు నేను మా లలితతో వుండి చేసేవాడిని. చక్కగా ఒకరినొకరు, విసుక్కుంటూ, సణుగుకుంటూ, అయ్యో మళ్ళీ ఆవకాయ సరిగ్గా రాదేమోనని లెంపలు వాయించుకుంటూ అదంతా ఓ ఆనంద తతంగం. అలాగా మాగాయికి ముక్కలు కడిగి, వాటిని ఎండబెట్టడం, కాకులు, ఉడతలు రాకుండా కాపలా కాయటం ఇవన్నీ బాధను, దుఃఖాన్ని, కోపాన్ని అణుచుకుంటూ చేస్తూనే ఆహా సంవత్సరమంతా ఆవకాయ మాగాయిలను తింటూ మళ్ళీ సంవత్సరానికి అన్నీ మరిచిపోయి తయారయిపోతాం. మా ఇంటికి శుభ్రంగా ఓ అయిదారు పెద్ద జాడీల ఆవకాయ, మాగాయ అలా ఆ చెట్టుతో మా అనుబంధం. గతేడాది మా ప్రక్కింటివారు ఇల్లు పడగొట్టి, ఫ్లాట్స్ కట్టుకుంటూ ఈ ప్రక్కన ఉన్న కొమ్మలు కొట్టుకుంటాం అని అడిగి శుభ్రంగా చెట్టుని మొత్తం కొట్టేశారు. ఆ తరువాత ఆ చెట్టు చిగురించనే లేదు. నాన్నగారికి అది కూడా ఒక బెంగ. ఇంట్లో మనిషి వెళ్ళిపోయినంత బాధపడ్డారు. చెట్టుని పదే పదే తలుచుకునేవారు. ఇక ఆవకాయ, మాగాయ కాయలు మార్కెట్లో కొని పెట్టుకున్నాం కాని అంత రుచి రాలేదు. మాకు తృప్తి లేదు. సరిగ్గా అదే సమయంలో నేను "అచ్చంగా తెలుగు" అనే ఫేస్‌బుక్ బృందంలో ఈ "జంధ్యాల పికిల్స్" వారి గురించి విని ఈ సంవత్సరం అక్కడనుంచి తెప్పిద్దామని భావించి వారికి ఫోన్ చెయ్యడం, వారు పంపించడం, అవి తిని నేను ఆనందించి ఆ అభిమానాన్ని ఈ వ్యాసం రూపంలో ప్రచురించడం జరిగిపోయింది. నేను అడిగిన వెంటనే పద్మినిగారు తనదైన శైలిలో వ్రాయటం అన్నీ చకచకా జరిగిపోయాయి. – గోటేటి వెంకటేశ్వరరావు

'అలాగా అఖిలం, అయితే ఆ బాలమురుగన్‌ని, ఆ పెరియాళ్వార్‌ను కూడా పిలిచి పెడదాం.'

' ఓ దానికేం భాగ్యం! నాయనా బాలమురుగన్, పెరియాళ్వార్ ఎక్కడున్నారు నాయనా, ఊ అను నాయనా ఊ అను...'

'ఆ వస్తున్నామండి, ఆరగిస్తాం !'

(స్వర్ణకమలం – అఖిలం)

* * *

'అరె, మీరు కనకమేడల కాంతారావు గారు కదూ. నేనండి, కుక్కమూతుల కుటుంబరావు గారమ్మాయిని. మీరు నన్ను పెళ్లి చూపులు చూడటానికి వచ్చిన 36వ పెళ్ళికొడుకు. మీరు పక్క ఊరు నుంచి వచ్చారని ఆకలి, ఆకలి అంటే, మా అమ్మ అప్పుడు మీకు ఉడుకన్నంలో ముద్దపప్పు, జంధ్యాల వారి చల్ల మిరపకాయలు, వెలక్కాయ పచ్చడి, కంద పచ్చడి వేసి భోజనం వడ్డించింది గుర్తుందా? ఇటువంటి పచ్చళ్ళు జన్మలో తినలేదంటూ లొట్టలు వేసుకుని మరీ తిన్నారు. ఆ తర్వాత నేను 'నీ నామమెంతో రుచిరా' అన్న పాట పాడాను. కానీ నా పాట దెబ్బకి మీరు వెంటనే పారిపోయారు. ఇప్పుడు పాడి వినిపిస్తాను, ఉండండి.'

'హమ్మో, నువ్వా తల్లీ. నీ పాట దెబ్బకు మా ఇంటిల్లిపాదీ ఆసుపత్రి పాలయ్యారు. చెవుల్లో విషప్రయోగం జరిగిందన్నారు. వస్తా తల్లోయ్ ...'

(లేడీస్ స్పెషల్ – చాముండి)

* * *

'నీ కోడలితో పడడం నావల్ల కాదు నాన్నా? అసలు ఏం చేసిందో తెలుసా? ఇవాళ పెళ్ళికి వెళ్ళామా? అక్కడ విస్తట్లో నాలుగు ఇడ్డెన్లు పెట్టి, పక్కన జంధ్యాల వారి కారప్పొడి, అల్లప్పచ్చడి వేసారు. ఇంకేముంది, చిన్నప్పుడు వాళ్ళ పిన్ని చేసిన పొడి, పచ్చడి గుర్తుకొచ్చాయట. కెయ్యి మని ఈల కొట్టింది. అసలే ఎన్.ఆర్.ఐ. సంబంధమేమో, ఫైర్ అలారం అనుకుని, అంతా పెళ్లి వాళ్ళంతా అటూ ఇటూ పారిపోయారు. ఎలాగో సర్ది చెప్పి, తీసుకువచ్చి, మళ్ళీ పీటల మీద కూర్చోపెట్టారు. తిరిగి వస్తుంటే, రైల్వే స్టేషన్ లో ఒకావిడ కలుపుకు తింటున్న చింతకాయకొరివికారం పచ్చడి చూసి, మళ్ళీ 'కుకుకూ' అని ఈల కొట్టింది. అక్కడ మేము ఎక్కాల్సిన ప్లాట్ఫారం మీద ఆగి ఉన్న ట్రైన్ వెళ్ళిపోయి, ప్రయాణికులంతా పరుగు పెట్టారు.'

'అసలైనా ఈ ఈల గోల మనకేల? కాలగతిని వదిలిపెట్టి, బేలగా వలవలా ఏడవకుండా, ఏ గోలా చెయ్యకుండా, ఇలలో కళకళ లాడుతూ, ఇలా హాయిగా మూల కూర్చుని, చిన్నప్పుడు తిన్న ఊరగాయల్ని లీలగా గుర్తు తెచ్చుకుని, అలమారలో పెట్టిన జంధ్యాల వారి పచ్చావకాయ తీసి, కలగలుపుకుని తిని, కలలు నిజమవుతాయని తెలుసుకుని, మేలు మేలని పొగుడుతూ, పరవశించిపోరాదా బాలకా?'

'ఏవిటీ ! ఇందులో ఎన్ని 'ల' లున్నాయో లెక్కెట్టుకో.'

'అబ్బా, నాన్నా నీ ప్రాస కోసం ప్రయాసతో చంపేస్తున్నావు. ఏమే, నువ్వు కూడా వచ్చావా? ఏవిటే నువ్వు ఇవాళ చేసిన పని?'

'కోప్పడకండి. ఆనందం వచ్చినా, దుఃఖం వచ్చినా, నాకు తెలియకుండానే నా చెయ్యి పైకి లేస్తుంది, వేళ్ళు నోట్లోకి వెళ్తాయి, నోట్లో నుంచి గాలొస్తుంది, బయటకు శబ్దం వస్తుంది... అందులోనూ జంధ్యాల పచ్చళ్ళ పేరు వింటే, నేను ఆనందం ఆపుకోలేనండి. ఏ తెలుగు వాళ్లైనా అంతేగా!'

'అవునా? ఈ జంధ్యాల పచ్చళ్ళ పేరు ఎక్కడ పడితే అక్కడ వినిపిస్తోంది. ఇంతకీ ఇవి ఎలా తెప్పించుకోవాలి?'

'జంధ్యాల పికెల్స్ వారి నెంబర్ – 9581582754. నెట్‌లో వీళ్ళ వెబ్‌సైట్ కూడా ఉందండి. వీళ్ళు పచ్చళ్ళు కొరియర్‌లో కూడా పంపుతారు.'

'అవునా అయితే తప్పక తెప్పిద్దాం.'

ఈల శబ్దం...

– భావరాజు పద్మిని

ఆయన అసామాన్యుడు

ఆయన అసమాన్యుడు. సాధారణంగా అందరూ ఒక నిర్ణయాన్ని ఆచితూచి తీసుకుంటారు. కానీ అయన నిర్ణయాలు క్షణాలమీద తీసుకుంటారు. ఆ నిర్ణయం అమలుపరచేదాకా అయన నిద్ర పోరు, ఇతరులని నిద్రపోనివ్వరు. ఆయన ఏంచేసినా అది శాస్త్రీయమే. ఆయనే టీ.వీ.కే. శాస్త్రి. కళాసాగర్ సాంస్కృతిక సంస్థ నుంచి తప్పుకొని, మద్రాసు తెలుగు అకాడెమిని అయన స్థాపించారు. అకాడెమీ తరపున లెక్క లేనన్ని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకి కార్యక్రమం అంటే మధ్యాహ్నం రెండు గంటలకే ప్రేక్షకులు హాలు ముందు ప్రత్యక్షం అయ్యేవారు. వర్ధమాన కళాకారుడు దగ్గరనుంచి విఖ్యాత కళాకారుల దాకా ఆయన కార్యక్రమం అంటే ఎంతో భక్తి శ్రద్ధలు ప్రదర్శించేవారు. మద్రాసు తెలుగు అకాడెమి ఉగాది పురస్కార్ బహుమతి అంటే కళాకారులు ఆస్కార్ పురస్కారంగా అనుభూతి పొందేవారు. భారత్ కల్చరల్ ఇంటేగ్రేషన్ కమిటీ పేరున దేశమంతటా ఎన్నో సంగీత భక్తి ప్రధాన కార్యక్రమాలు నిర్వహించారు. దేశ రాష్ట్రపతి, ప్రధాన మంత్రి నుంచి పలు ప్రముఖులు ముఖ్య అతిథులుగా ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఒక సామాన్యుడు డబ్బు పెట్టి టికెట్ కొనకుండా ఉచితంగా సాంస్కృతిక కార్యక్రమం హాలుకి వెళ్లి చూసి ఆనందించాలన్నదే శాస్త్రిగారి ముఖ్యోద్దేశం. 1980 లలో మద్రాసు నగరంలో దీనిని శాస్త్రిగారు ప్రవేశపెట్టిన కొత్త ఒరవడి అని చెప్పవచ్చు.

ప్రయోగాత్మకమైన ఎన్నో జుగల్బందీలు వినూత్న శైలిలో కనీ వినీ ఎరుగని రీతిలో పేరొందిన కళాకారులచేత చేయించారు. శాస్త్రిగారి వేదిక మీద ఒక్కసారి ప్రదర్శన ఇస్తే దేశవ్యాప్తంగా తమకు పేరు ప్రఖ్యాతులు వస్తాయని తలపోసిన కళాకారులు ఎంతోమంది. కొన్ని కార్యక్రమాలు, అనివార్య కారణాలవల్ల చివరి క్షణంలో కొందరు స్పాన్సర్లు వెనుకంజ వేసినప్పుడు, లేదా కొందరు కళాకారులు రాలేని పరిస్థితి ఏర్పడినప్పుడు ఖర్చులకి వెరవక ధైర్యంగా మరో కళాకారులతో, ఆ కార్యక్రమాన్ని ఘనంగా నడిపించి శాస్త్రి గారు అందరి మన్ననలు పొందారు. స్పిరిట్ అఫ్ యూనిటీ కాన్సర్ట్స్ పేరిట ఆదివారాలు ఆ రోజుల్లో దూరదర్శన్‌లో శాస్త్రిగారి రికార్డెడ్ ప్రోగ్రాములు విరివిగా వచ్చేవి.

ఆయన ఒక వ్యవస్థ. సాధారణంగా వ్యక్తులు వ్యవస్థల మీద ఆధారపడతారు. కాని ఆయనమీద వ్యవస్థలు ఆధారపడేవి. శాస్త్రిగారి కార్యక్రమం అంటే ఒక TVK MARK అదే ISA MARK... వారి కార్యక్రమాలు ఒక బెంచ్ మార్కు. వారి కార్యదీక్షత అనితర సాధ్యం. అందరికీ అన్ని పనులూ పురమాయించినప్పటికీ, అంతా తానే అయ్యి చక్రం తిప్పేవారు.

ఎప్పుడైనా ఎవరైనా "శాస్త్రి గారూ, మీ టెలిఫోన్ చాలాసేపు ఎంగేజి టోన్ వస్తోంది" అని అంటే, "నీలాగా ఎందరో వరసగా ఫోన్లు చేస్తూవుంటే నాకు యంగ్ ఏజి రాక ఓల్డ్ ఏజి ఎలా వస్తుందయ్యా?" అని చమత్కరించేవారు.

కమ్యూనికేషన్, నెట్ వర్కింగ్ స్కిల్ల్స్ వారి దగ్గరే నేర్చుకోవాలి. కేవలం టెలిఫోన్లు మాత్రం వున్న ఆ రోజులలో వారికి వున్న పరిచయస్థులు, కమ్యూనికేషన్ స్కిల్ల్స్ ఈనాడు ఇంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వున్నప్పటికీ చాలామంది సాధించలేరు.

గొప్ప విషయం ఏమిటంటే,శాస్త్రి గారు ఎన్నడూ వ్యక్తిగతంగా వారి కోసం తమ పలుకుబడిని ఉపయోగించుకోలేదు. ఆయన పదిమంది మంచి కోరేవారు, దానికోసం శ్రమించేవారు. వారు ఎన్నడూ ఏదీ తనకోసం ఆశించి ఎరుగరు.

కేవలం ప్రఖ్యాత కళాకారులకే కాకుండా, మరుగున పడినవారికీ, వర్ధమాన కళాకారులకి అందరికి తమ కార్యక్రమాలలో అవకాశం ఇచ్చేవారు. 1994 లో నేను ఎం.బి. ఏ. చదవటం మొదలుపెట్టాను. "నువ్వు ఎందుకు ఎం.బి. ఏ చదువుతున్నావు?" అని ఆయన నన్ను అడిగారు. మేనేజ్మెంట్ స్కిల్ల్స్ నేర్చుకోవటానికి చదువుతున్నాను అని అన్నాను. దానికి ఆయన "మన కార్యక్రమాల నిర్వహణలో నీకు మేనేజ్మెంట్ స్కిల్ల్స్ కనిపించలేదా?" అని ప్రశించారు. నేను ఎం.బి. ఏ. పూర్తి చేసిన తరవాత కానీ నాకు వారి మాటల్లోని సత్యం బోధపడలేదు. "నాతో మాట్లాడటమే ఒక ఎడ్యుకేషన్" అంటాడు గిరీశం కన్యాశుల్కంలో శిష్యుడు వెంకటేశంతో. నాలుగు దశాబ్దాల మా గురు శిష్య సంబంధంలో తొలి దశాబ్దం (1980) శాస్త్రిగారితో పాటు సన్నిహితంగా గడపటమే నా జీవితంలో గొప్ప ఎడ్యుకేషన్ అని నేను సగర్వంగా చెప్పగలను. ఒకవిధంగా నేను పుట్టడానికి ముందునుంచే ఆయన మా కుటుంబానికి సుపరిచితులు. ఆయన బొబ్బిలినుంచి మద్రాస్ వచ్చిన కొత్తల్లో మా పెదనాన్నగారు చార్టెడ్ ఎకౌంటెంట్ శ్రీ బోడపాటి రాజన్న గారి (మా పెద్దమ్మ గారి భర్త) ఇంట్లో హనుమాన్ కోవెల వీధి, పాత మాంబళం లో అద్దెకి ఉండేవారు. అప్పట్లో ఆయనకి ఇంకా పెళ్లి కాలేదు.

మద్రాసు నగరం ఆంధ్రుల సాంస్కృతిక రాజధాని అని ఇప్పటికీ అందరూ అంటున్నారంటే – కేవలం కళాకారుల నిలయమే కాదు, శాస్త్రిగారివంటి కళా పిపాసి, ప్రోత్సాహకులు, కళాపోషకులు నెలవున్న పట్టణం కావటం మద్రాసు నగరం, మద్రాసు లోని ప్రజలు, ముఖ్యంగా ప్రవాసాంధ్రులు చేసుకున్న అదృష్టం. తనవల్ల వీలైనన్ని గుప్త దానాలు ఎన్నో చేసేవారు. ఆయన చిరునామా అవసరం లేని వ్యక్తి. టీ.వీ.కే. శాస్త్రి, టీ.నగర్, మద్రాస్ అని వారి వీధి పేరు (మెలోని రోడ్), ఇంటి నంబర్ (25) లేకపోయినప్పటికీ ఆయన పేరున రాసిన ఉత్తరాలు కోకొల్లలు పోస్ట్ మాన్ ఖచ్చితంగా వారి ఇంటికి తెచ్చి ఇచ్చేవాడు. తెల్ల ప్యాంటు, తెల్ల షర్టు, నల్ల బూట్లు ఆయన ట్రేడ్ మార్క్ ఆహార్యం.

మార్చ్ నెల రెండో తారీకు 2014 న శాస్త్రిగారి మరణంతో ఎందరో కళాకారులకి మరెందరో కళాభిమానులకి తీరని లోటు కలిగింది. వారు కారణ జన్ములు, కర్మ యోగి. ఆయన జన్మ రాహిత్యాన్ని పొందారు.

– బీ.యన్.వీ. పార్థసారది

‘వేణుగాన చక్రవర్తి’ ప్రపంచం సీతారాం గారు

సంగీత వాద్యాలన్నీ కష్టసాధ్యాలే కానీ, వేణుగానం మరింత కష్టతరమని చెప్తారు అనుభవజ్ఞులు. ఎందుకంటే, ఊపిరి పోయడమేకాదు, ఆ ఊపిరిని నియంత్రిస్తూ శ్రుతిలో లీనం చేయడం కఠోరసాధనతో మాత్రమే సాధ్యం. బహుకొద్దిమంది మాత్రమే వేణువిద్వాంసులుగా కీర్తిశిఖరాలనందుకోగలిగారు. అందులోనూ మన తెలుగునాట, లబ్ధప్రతిష్టులైన వేణువాదకులను వేళ్లతో లెక్కించవచ్చు.

ప్రపంచం యావత్తూ మెచ్చిన ‘వేణుగాన చక్రవర్తి’ ప్రపంచం సీతారాంగారు, తెలుగువారు కావడం మన అదృష్టం. ఆరు దశాబ్దాలకు పైగా, తన వేణుగానంతో విశ్వవేదికలనుండి శ్రోతలనలరించిన సీతారాంగారు, తన ఎనిమిదవ ఏటనే బాలకళాకారునిగా సంగీతరంగ ప్రవేశం చేశారు.

వేణువాదనంలో మహామేరు నగంలాంటి టి.ఆర్.మహాలింగం గారి శిష్యరికం చేసి, తదనంతరం ‘సంగీత కళాచార్య’ సంధ్యావందనం శ్రీనివాసరావు, ‘నాదసుధార్ణవ’ అన్నవరపు రామస్వామిగార్ల వంటి సద్గురువుల సుశిక్షణలో సానపట్టిన వజ్రంలా ప్రకాశించారు. లండన్ ‘ట్రినిటీ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్’ ద్వారా పాశ్చాత్య సంగీతంలోనూ శిక్షణనందుకున్నారాయన.

సంగీత కుటుంబంలో పుట్టిన సీతారాంగారి బాల్యమంతా బెజవాడలో గడిచింది. అటు సంగీతంతోపాటు, ఇటు చదువులోనూ ఆయన మేటి అనిపించుకున్నారు. MA, PHD చేశారాయన. న్యూఢిల్లీలో ఒక అయిదు నక్షత్రాల హోటల్‌లో, వాద్యబృందంలో కళాకారుని స్థాయి నుండి అంచెలంచెలుగా ఎదిగి, చెన్నై, న్యూఢిల్లీ, విజయవాడ ఆకాశవాణి కేంద్రాలలో అత్యున్నత పదవులను అలంకరించేవరకూ నిద్రపోలేదాయన. భారత రాష్ట్రపతి పురస్కారం, కేంద్ర సంగీత, నాటక అకాడెమీ పురస్కారం, మద్రాస్ మ్యూజిక్ అకాడమీవారి టి.టి.కె.అవార్డు, యునెస్కో (UNESCO) ప్రాయోజిత పురస్కారం, లావోస్ దేశాధ్యక్షునిచే సత్కారం, తమిళనాడు ప్రభుత్వ ‘కలైమామణి’ బిరుదం, చెన్నై ఇండియన్ ఫైన్ ఆర్ట్స్ అకాడెమీవారి ‘కళా శిఖామణి’ బిరుదం... టిటిడి వారిచే ‘సప్తగిరి సంగీత విద్వన్మణి’...వారి కీర్తికిరీటంలో కలికితురాయిలు.

దేశ, విదేశాలలో 40కి పైగా విశ్వవిద్యాలయాలలో గౌరవ సలహాదారుగా సేవలందించారాయన! తిరుపతి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో సంగీత శాఖాధిపతిగా పనిచేశారు. ఎంతోమంది వీరి పర్యవేక్షణలో డాక్టరేట్లు పొందారు.

టాప్ గ్రేడ్ పొందిన వేణువిద్వాంసులు, సంగీత స్వరకర్త ఆయన. ‘ఆకాశవాణి సంగీత సమ్మేళన్’ కార్యక్రమంలో ఆయనకు బాలమురళీకృష్ణగారు వాయులీన సహకారాన్ని అందించారంటే... ఆయన స్థాయిని ఎవరైనా అంచనా వేయవచ్చు.

నేను మొట్టమొదటిసారి సీతారాంగారి కచేరీని, పారుపల్లివారి వర్ధంత్యుత్సవాలలో ముప్పై అయిదేళ్లక్రితం విన్నాను.’విజయనాగరి’ రాగంలో ముత్తయ్య భాగవతార్ గారి కృతి ‘విజయాంబికే’... ఆయన పలికించిన తీరు అమోఘం! ఆ రాగప్రవాహం, కృష్ణవేణీ ఝురులను, ఆ కృతి గమనం, బెజవాడ కనకదుర్గమ్మ ఆకృతిని తలపించాయి.

ఆయన నిత్య సాధకులు. ఒకసారి, నేను ఆయనతో కలసి, న్యూఢిల్లీకి రైలులో ప్రయాణం చేశాను. సూర్యోదయ సమయంలో ఆయన వేణువు తీసి, మంద్ర స్థాయిలో వర్ణ సాధన ప్రారంభించారు. కొంతసేపటికి, తోటి ప్రయాణీకులనుండి అభ్యంతరం వ్యక్తమౌతుందేమోనని భయపడ్డాను నేను. అయితే,ఆశ్చర్యకరంగా వారంతా ఆనందంగా వినసాగారు. చూస్తూండగానే మేమున్న చోటుకు, రైలులోని ప్రక్క గదులలోని ప్రయాణీకులు కూడా వచ్చి, చెంత కూర్చొని, ఆ ఆనందసాగరంలో ఓలలాడి, అభినందనలతో సీతారాంగారిని ముంచెత్తారు. సహకార వాద్యాలు లేకపోయినా, పూర్తి స్థాయి కచేరీలా సాగింది ఆనాటి వారి సాధన!

ఎంతో నిరాడంబరులు, స్నేహశీలి, సహృదయులు ఆయన. తిరుపతిలో అన్నమయ్య జయంతిలో ‘శుభాళి’ రాగంలో నేను స్వరపరచుకొన్న ‘పరమపాతకుడ’ అనే అన్నమయ్య కీర్తన నానోటవిని, నిర్వాహకుల అనుమతితో మైకు తీసుకొని, నన్ను అభినందిస్తూ, ‘అన్నమయ్య కీర్తనలకు ఎంతోమంది స్వరం కడుతున్నారు. కానీ సుధాకర్, అన్నమయ్య హృదయాన్ని స్వరబద్ధంచేసి, ఆవిష్కరించారు’ అంటూ నన్ను ఆయన అభినందించడం, జీవితంలో మరువలేను.

2010 వ సంవత్సరం, బెజవాడ ‘గాయకసార్వభౌమ’ సంగీత పరిషత్ పక్షాన, బాలమురళిగారి సువర్ణహస్తాలతో, సీతారాంగారికి ‘సునాద సుధానిధి’ బిరుదాన్ని ప్రదానం చేయించడం, నాకు దక్కిన గొప్ప సదవకాశంగా భావిస్తాను.

ఉద్యోగ విరమణానంతరం, మదరాసులో స్థిరపడ్డారాయన. అమెరికా, కెనడా, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, రష్యా, జర్మనీ, యూకే, ఇటలీ, పోలెండ్, హాంకాంగ్, సింగపూర్...ఈ విధంగా ప్రపంచమంతా సంగీత యాత్రచేసి, మురళీగానంతో ముజ్జగాలనూ మోహింపచేసిన డా.ప్రపంచం సీతారాంగారు, 2014 వ సంవత్సరం, తన 72 వఏట, అమెరికాలో, ఏకృష్ణ సాయుద్యాన్ని పొందారు. తెలుగువారి కీర్తిపతాకాన్ని ప్రపంచమంతా ఎగురవేసిన అటువంటి ఆణిముత్యాలను గురించి ఈనాటి తెలుగు యువత తెలుసుకోవలసిన అవసరమెంతైనా ఉంది.

– మోదుమూడి సుధాకర్

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
“అజంతా”
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై

వివిధ రంగాలలో 'ప్రథమ' మహిళామూర్తులు వీరే



నేటి దినపత్రికల్లో తొలి అంతరిక్ష మహిళ కల్పనాచావ్లా అనీ, తొలి దేశాధ్యక్షురాలు ప్రతిభా పాటిల్ అనీ పెద్ద పెద్ద అక్షరాలలో చదువుతున్నాం. అయితే మన హిందూ శాస్త్ర పురాణాదులను సునిశితంగా చదివినట్లయితే వివిధ రంగాల్లో తొలిస్థానం ఆక్రమించిన మహిళలు దగ్గరదగ్గరగా ఓ 25 మంది దాకా వున్నారు. అయితే వారు యే విధంగా ఈ ప్రథమ లేదా తొలి స్థానాన్ని ఆక్రమించి వందనీయులైనారో తెల్సుకుంటే విస్మయం కల్గక మానదు. తొలి ఘనత వహించిన ఈ మహిళా మణులందరూ తమలోని ఒక ప్రత్యేక గుణం వల్లనే గౌరవించబడినారు. హోదా, డబ్బు, ఆస్తి అనే అంశాల వల్ల కానే కాదు. మరి నేటి మహిళలో? నాటి మహిళలకు ఎటువంటి సిఫారసులు లేకున్నా వారు తమ, తమ వ్యక్తిత్వ వికాసం కారణంగా చరిత్రలో సుస్థిరమైన స్థానాన్ని ఆక్రమించారు.

ధర్మాన్ని ఉద్ధరించటానికి శ్రీమహావిష్ణువు స్వయంగా కపిలావతారాన్ని ధరించారు. కపిలుని తల్లి పేరు దేవహుతి. ఎంతో సాధారణమైన స్త్రీ. కాలవశంలో భర్తయైన కర్దముడు కుమారుడు కపిలుని వల్ల మోసారం తెల్సుకుని దివ్యలోకాలకు వెళ్ళిపోగా దేవహుతి తనకు కూడా అదే తరుణోపాయం చూపమని కోరగా కపిలుడు ఆమెకు బ్రహ్మవిద్యను బోధించి, ఆమెను స్త్రీలోకంలోనే తొలి బ్రహ్మ విద్యాధికురాలిగానే కాక తొలి శిష్యురాలిగా కూడా ప్రపంచానికి అందించాడు. కుమారుడి వల్ల బ్రహ్మవిద్యను పొందిన స్త్రీగా కూడా ఆమె తొట్టతొలి విఖ్యాతురాలైంది.

మంగళకరుడైన శివుని భర్తగా పొందడానికి పార్వతీదేవి తొలిగా... అంటే మొట్టమొదటగా నోము నోచిన స్త్రీ రత్నంగా కీర్తిని పొందింది. ఈ నోమును అగస్త్య మహర్షి ఆమె చేత చేయించాడు. ఆ నోమే 'నందా వ్రతము'గా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ పార్వతీదేవి తనకు మాంగల్య భాగ్యం కల్గడానికి మాత్రమే నోము చేసింది కానీ వేరే కోరికలు తీర్చుకోవటానికి కాకపోవడం గమనించగలరు.

భర్తను అనుమానించిన కారణంగా సతీదేవి అగ్నికి ఆహుతి అయ్యింది. ఈ సంఘటనలో ఏ భార్యయైనా పతిని దూషిస్తుంటే వినడం కన్నా దేహత్యాగం చేసుకోవడం మేలని భావించడం వల్లనే తొలి ప్రతివ్రతా శిరోమణిగా నిల్చిపోగల్గింది.

పాతివ్రత్య మహిమ కారణంగా అనసూయా దేవి త్రిమూర్తులను పసిపాపలుగా మార్చి తొలి వందనీయురాలైంది.

మామగారి పోయిన రాజ్యం కోసం, తన సంతానం కోసం భర్తను పునర్జీవితునిగా చేసి సావిత్రి ఖ్యాతి గడించింది.

కైక కోసం రాజ్యాన్నే కాక– భర్త ప్రాణాలు సైతం త్యాగం చేసి తొలి స్త్రీరత్నంగా కౌసల్యాదేవి నిల్చింది.

ఇంద్రుని చేత అపహరణకు గురైన లీలావతీదేవిని ఓదార్చి తన ఆశ్రమంలో నీడనిచ్చిన నారదునికన్నా అంతటి మానసిక భయాందోళనల్లోసైతం మానసిక స్థైర్యాన్ని కోల్పోక ఒక మహాభక్త శిఖామణి జన్మకు కారణమై, తల్లులందరికీ మహాతల్లిగా వాసికెక్కింది.

నాగుల తల్లి కద్రువతో పందెం కాసి పరాజయం పొందినా తొలిగా పందెం కాసిన మహిళగా, పందెంలో వోడి మొదటి దాసిగా అవతారం ఎత్తినా, ఈ రెండింటినే విజయసోపానాలుగా మార్చుకొని తన కుమారుడైన గరుడినితో అమృతాన్ని భువికి తెప్పించిన తల్లిగా వినత ఖ్యాతికెక్కింది.

భర్త మృతికి తన సౌందర్యం కారణమైంది అన్న మహోత్తర భావనతో 'మాద్రీ' పాండురాజుతో సహగమనం సలిపి, తొలి సహగమనం చేసిన స్త్రీగా కీర్తి సంపాదించింది.

తొలిపత్నిగా, తొలిమాతగా పార్వతి నిల్చింది.

తొలిగా గాంధర్వ వివాహం చేసుకున్న శకుంతలాదేవి భరత చక్రవర్తికి జన్మనివ్వడమే గాక, మౌన పోరాటం సలిపి దుష్యంతుని చేరుకున్న మొట్టమొదటి స్త్రీగా నిలిచింది.

మొదటి దుష్ట స్త్రీగా (విలన్) ముద్ర వేయించుకున్నప్పటికిని రామాయణ కథను గొప్ప మలుపు తిప్పిన మహిళగా మంధర మన్ననలందింది.

తొలిగా సింహాసనాన్ని అధిష్టించిన మహిళగా ఝాన్సీలక్ష్మీ తొలి మంత్రిణిగా వాలి భార్య తార, యుద్ధ వనితగా సత్యభామ, తొలి నగర రక్షణిగా లంకిణి, తొలి వేదాంతినిగా 'గార్గి', తొలి ఉపాసకురాలిగా 'శబరి', తొలి వనవాసం చేసిన మహిళగా సీతాదేవి విఖ్యాతులైన సంగతి మనందరికీ తెలుసు. వీరందరిలో సత్యభామకు మరొక ప్రత్యేకత వుంది. మొట్టమొదట బాణసంచా తయారుచేసిన స్త్రీగా ఆమెకు విశిష్ట స్థానం ఇవ్వబడింది. ఈ విద్యను ఆమె తన తండ్రి అయిన సత్రాజిత్ వద్ద నుండి నేర్చుకున్నట్లు వేదనిరుక్తంలో చెప్పబడివుంది. బిడ్డ క్షేమం కోరి కృష్ణుని యశోదకు ఇచ్చిన దేవకి, కృష్ణుని కన్నబిడ్డకన్నా మిన్నగా పెంచిన తల్లిగా యశోదకు ఎటువంటి స్థానం ఇచ్చినా తక్కువే అవుతుంది.

కన్యాత్వం వచ్చి 10 వేల సంవత్సరాలైనా పెళ్ళికాని రేవతి (బలరాముని భార్య) మనోస్థైర్యం కోల్పోక ఆదిశేషునే భర్తగా పొంది తొలి ఓర్పు కల మహిళా రత్నంగా పేరుగాంచింది.

తొలి గూఢచారిణిగా శూర్పణక ప్రవర్తించి వుండకపోతే రామకథే లేదు! జూదంలో పందెం వస్తువుగా మారిననూ ద్రౌపది మహాభారత కథనే మలుపు త్రిప్పిన స్త్రీ రత్నంగా, తొలి రాజకీయం వ్యూహ మహిళాకర్తగా ఖ్యాతి వహించింది. దివినుంచి భువికి దిగిన గంగామాత తొలి పుణ్య నదీమ తల్లిగా కీర్తి గాంచింది. మొదటి అంతరిక్ష మహిళామణిగా చంద్రుని భార్య రోహిణీ దేవి వాసికెక్కింది. ఆధునిక రాజకీయ మహిళగా పల్నాటి నాగమ్మ, కైకేయి తొలిస్థానం పొందగా, రామదండుకు సాయం చేసిన హనుమసీతను చూడడానికి సాయపడిన తొలి స్త్రీమూర్తిగా 'స్వయం ప్రభ' కీర్తి గడించింది. తొలిగా తన ప్రేమను పంచుకోవడానికి దమయంతి పంపిన హంస రాయభారం కథ మనం మరువగలమా? తొలి ప్రేమ పిపాసిగా/ మూర్తిగా ఆమెకున్న స్థానం మరువలేనిది.

ఇలా చెప్పుకుంటూ పోతే వ్యాసవిస్తరణ తప్ప, ఈ నిత్యనూతన వ్యాసాంశానికి ముగింపు లేదు కానీ నేటి మన భారతంలో తొలి స్థానాన్ని ఆక్రమించిన మహిళా శిరోమణి అంటూ వుంటారు. కాని ఇక్కడ పురాణ ఇతిహాసాలలో ఎంతమంది మహిళలు, స్త్రీలు, తొలిగా ఘనతలు సాధించారో తెలియచెప్పటానికే ఈ వ్యాసం. కాబట్టి జరిగిన ప్రతిదానికి మేమే కరాణం అన్ని చెప్పుకోనవసరం లేదు. స్త్రీ సమానత, స్త్రీకి పురుషునితో సమానంగా గౌరవం ఎప్పుడో ఇవ్వబడింది.

– చల్లా జయదేవానందశాస్త్రి

అమెరికా-భారత్ కలిస్తే 'విశ్వశాంతి'

దివ్య పర్యటనకు వెళ్తున్న విశ్వంజీ
ఐదు నెలల పాటు అమెరికాలో పర్యటన

అంతర్జాతీయంగా భారత్ శక్తివంతమైన దేశంగా మారుతోందని, ఈ పరిస్థితిలో భారత్-అమెరికా సయుక్తంగా విశ్వశాంతికి పాటుపడాల్సిన అవసరం ఉందని విశ్వయోగి విశ్వంజీ పేర్కొన్నారు. అమెరికాలో దివ్యపర్యటనకు వెళుతూ ఆయన అందించిన సందేశం-ప్రపంచంలో ఉద్రిక్తపరిస్థితులు నెలకొని ఉన్న ఈ సమయంలో యోగులు విశ్వశాంతి కోసం పాటుపడుతున్నా రన్నారు. వివిధ దేశాల నేతలు ఎలా పనిచేస్తున్నప్పటికీ యోగులు తమ శక్తిని మానవ వికాసానికి ఉపయోగిస్తూ ఉంటారన్నారు. భారత్ తన శక్తిని ధర్మరక్షణ కోసం వినియోగిస్తూ ఉంటారన్నారు. భారత్ తన శక్తిని ధర్మరక్షణ కోసం వినియో గిస్తూ, ప్రేమ, శాంతిని ప్రపంచానికి అందించాలని సూచించారు. భారతదేశం సనాతన ధర్మంపై ఆధారపడి ఉందని, భారత్ అందించే సనాతన ధర్మాన్ని ప్రపంచం గుర్తిస్తుందని తాను గత రెండు దశాబ్దాలుగా చెబుతూనే ఉన్నానని, ఇప్పుడు అది నిజమవుతోందన్నారు.

హృదయం, మెదడు మనిషికి ఎలాంటివో ప్రపంచానికి భారత్-అమెరికా దేశాలు అలాంటివన్నారు. హృదయం స్వచ్ఛమైన రక్తాన్ని మెదడుకు పంపిస్తే, మెదడు సజావుగా పనిచేస్తుందని దాంతో శరీరం చక్కగా ఉంటుందన్నారు. అలాగే భారత్-అమెరికాలు సంయుక్తంగా, సమైక్యంగా విశ్వశాంతి కోసం పనిచేస్తే ప్రపంచ దేశాల్లో శాంతి నెలకొంటుందన్నారు. ప్రపంచంలోని వివిధ దేశాల నేతలు రాజకీయ వైషమ్యాలు మానుకుని, ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించు కుని పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఘర్షణలు, యుద్ధాల వల్ల సమస్యలు పరిష్కారం కాదని, దేశాల మధ్య ఏవైనా సమస్యలు ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవా లన్నారు. ప్రపంచంలోని దాదాపు అన్ని ప్రధానమైన దేశాల నుండి మేధావులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు అమెరికాకు వెళుతుంటారని, వారి ద్వారా శాంతి సందేశం విశ్వవ్యాప్తంగా చేరవేయాలన్నదే తన ఉద్దేశమన్నారు.

ప్రతి మనిషి తన ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలని, 'దేహమే దేవాలయం - హృదయమే దైవపీఠం' అన్నది తన ఉద్దేశమని విశ్వంజీ పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉంటే సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా యువత సరైన మార్గంలో నడవాలని, అందుకు వారి తల్లిదండ్రులు, ప్రభుత్వాలు దారి చూపించాల్సి ఉందన్నారు. యువత మాదకద్రవ్యాలు, ఇతర చెడు అలవాట్లకు లోనుకాకుండా చూడాల్సి ఉందన్నారు. మేధావులు, యువత మేధస్సు వినాశనానికి కాకుండా, సమాజ వికాసానికి వినియోగపడేలా పనిచేయాలన్నారు.

కాలుష్యరహితంగా ప్రపంచాన్ని రూపుదిద్దాల్సిన అవసరం ఉందని, భూమి, నీఱు, గాలి, ఆకాశం కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత పరిపాలకులు, ప్రజలపై ఉందని విశ్వంజీ పేర్కొన్నారు. పంచభూతాలు కలుషితం అయితే ప్రకృతి వైపరీత్యాలు వస్తాయని, చాలా దేశాలు నేడు ప్రకృతి వైపరీత్యాల వల్ల ఇక్కట్లకు గురవుతున్నాయని గుర్తుచేశారు. పంచభూతాలను రక్షించుకునేందుకు అందరూ సమైక్యంగా పనిచేయాలని విశ్వయోగి విశ్వంజీ పిలుపు ఇచ్చారు.

పరమార్ధ కథలు

శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు

భగవానుడు సర్వవ్యాపి

ఒకానొక కాలేజీ విద్యార్థి పెద్ద పరీక్షలు (Annual Examination) సమీపించినపుడు తాను గణిత శాస్త్రములో చాల వెనుకబడి యుండుటచే పరీక్ష యందుత్తీర్ణుడగుట కష్టమని తలంచి ఆ గ్రామములోని దేవాలయమునకు బోయి దేవునకు నమస్కరించి "మహానుభావా! రేపటి దినము గణిత పరీక్ష. నాకావిద్యలో ప్రావీణ్యము లేదు. పరీక్ష తప్పినచో విద్యార్థి సంఘములో నగుబాట్ల పాలగుదును. కావున దయయుంచి అద్దానియందు నన్ను కడతేర్చినచో నీకు పులిహోర, చక్కెర పొంగలితో చక్కని నైవేద్యము సమర్పించుకొందును. దేవా! పాహి! పాహి!" అని మొరపెట్టుకొని ఇంటికి వెడలిపోయెను.

మరుసటిరోజు పరీక్ష ఏతెంచెను. ప్రశ్నపత్రములు అందరికిని పంచి పెట్ట బడెను. మన కథానాయకుడగు విద్యార్థికిన్ని ఇవ్వబడెను. కాని ఏమని చెప్పవచ్చును? ఆతని ఆనందమునకు మేరయే లేదు. అన్నియు తనకు తెలిసిన లెక్కలే కావున అత్యానందముతో భగవానునకు లోలోన జోహారులర్పించుకొనుచు చకచక ఒక గంటలో అన్ని లెక్కలను నిర్దుష్టముగ చేసిపారవేసెను.

పరీక్ష కాలము 3 గంటలు ఏర్పాటు చేయబడెను. కావున మన విద్యార్థికి ఇంకను 2 గంటలు కాలము మిగిలియే యున్నది. ఊరకనే కూర్చొనుట దేనికని తలంచి అతడు కొన్ని తెల్ల కాగితములు తీసికొని దానిపై మరుసటిరోజు భగవంతునకు సమర్పించవలసిన నైవేద్యమునకు కావలసిన వస్తువుల జాబితా తయారుచేయ నారంభించెను.

పులిహోరకు బియ్యము, నూనె, చింతపండు, మిరపకాయలు, పసుపు మున్నగునవియు చక్కెరపొంగలికి బియ్యము, చక్కెర, పెసరపప్పు, నెయ్యి, జీడిపప్పు, ద్రాక్ష ఇత్యాదులును ఏయే పరిమాణములలో కావలయునో అంతయు వ్రాసిపెట్టెను.

ఇంతలో అతనికొక ఆలోచన తట్టెను. భగవంతునకు రుచులెందుకు? విలాసములెందుకు? కావున ద్రాక్ష అనవసరము, జీడిపప్పుఅంతకంటె అనవసరము, అని తలంచి ఆ రెండు పేర్లను, దానికగు ఖర్చును జాబితాలో కొట్టివేసెను. మరల కొంతసేపు దీర్ఘాలోచన చేసి చక్కెర సగానికి సగం తగ్గించెను. పిదప గీతయందలి "కట్వామ్లల వణాత్యుష్ణ" అను శ్లోకము జ్ఞాపకమునకు రాగా, దేవునకు పులుపు, కారం ఇష్టముండదని నిశ్చయించి ఆయా వస్తువులను తీసివేసెను. ఈ ప్రకారముగ తాను వ్రాసిన వస్తువులన్నిటిని కొట్టివేయుటయో, తగ్గించుటయో జరుపుచుండెను.

తుట్టతుదకు అతనికొక ఊహ జనించెను. అసలు దేవునకు ఈ గొడవయంతయు దేనికి? ఇంత ఖర్చు ఎందులకు? "పత్రం, పుష్పం, ఫలం, తోయం" అని చెప్పియే యున్నారు కదా! అవి ఇచ్చుకుంటే చాలదా! అని భావించి ఇతఃపూర్వము వ్రాసిన జాబితా మొత్తం కొట్టి పారవేసెను. మరల యోచించి పత్రపుష్ప ఫలాదులలో కూడ ఫలములు, పుష్పములు, పత్రములు ఈ కాలములో డబ్బు ఇచ్చిన కాని దొరకవు. ఒక్క తోయమే (నీళ్ళు) అందుబాటులో ఉన్నది. దొడ్డిలో బావి ఉన్నంతవరకు దానికి దిగులు లేదు. అని తలంచి దేవునకు తోయము (జలము) మాత్రము సమర్పించుటకు తీర్మానించెను.

మరల దానిని కూడ రద్దు చేసి నీళ్ళు తోడునట్టి ఆ ప్రయాస కూడ ఏల? మానసికముగా నీళ్ళు సమర్పించినట్లు భావించిన చాలదా! అనుకొనెను. ఈ ప్రకారముగ నాతని మనంబున భావనా పరంపరలు పరుగులెత్తుచుండ, పరీక్షా సమయము పూర్తి కాగా పరీక్షాధికారి ఆ విద్యార్థి వద్దకు తటాలున వచ్చి "Answer paper please, quick" (జవాబు కాగితములు త్వరగా ఇవ్వండి) అని అరచెను. ఆ తొట్రుబాటులో ఆ విద్యార్థి పులిహోర, చక్కెర పొంగలి బాపతు కాగితములను మడతపెట్టి అధికారికి ఇచ్చివేసి తాను వ్రాసిన అసలు లెక్కల కాగితములను మడతపెట్టి ఇంటికి తీసికొని వెళ్ళెను.

ఇంటికి రాగానే తండ్రి 'ఏమిరా? లెక్కలు బాగుగా వ్రాసినావా?' అని అడుగ 'అద్భుతముగా వ్రాసితిని. భగవంతుడు కరుణించినాడు. అన్నియు తేలిక లెక్కలే వచ్చినవి!' అని కుమారుడు బదులు చెప్పెను. ఇంతలో తండ్రి "ఏదిరా ప్రశ్న పత్రము చూతము ఇటు తెమ్ము" అని అడుగ, కుమారుడు తాను తెచ్చిన కాగితములను చూపెను. అవి చూచి తండ్రి సంభ్రమ చిత్తుడయ్యెను. "ఇది యేమిరా? నీవు పరీక్షలో వ్రాసిన లెక్కల కాగితములు (Answer papers) అధికారికి ఇవ్వక ఇంటికి తెచ్చినావేమి? అయ్యో! ఎంత పొరపాటు చేసితివి? అని మందలింపగా, కుమారుడది చూచి లోలోన దుఃఖముచే కుమిలిపోవుచు 'నేను దేవుని మోసగించుటకు యత్నించితిని. ఫలితముగా నేనే మోసపోతిని. ఇక ఎన్నడూ ఇట్టి మోసకృత్యమును చేయను. దయామయుడు, భక్తవత్సలుడు నాపై కరుణామృత వర్షము కురిపించి నన్ను గట్టెక్కించినప్పటికిని నేనే చేతులార దానిని జారవిడుచుకొంటిని. ఇట్టి దుర్బుద్ధి ఇకమీదట నాకెన్నడును కలుగకుండు గాక!" అని పరితపించెను.

కావున భగవంతుని యునికి ఏదియో ఒక చోటున మాత్రము కలదని తలంపక బ్రహ్మాండమందలి ప్రతి అణువునందును, జీవుల యొక్క ప్రతి సంకల్పమునందును ఓతప్రోతమై వెలయుచుండునని నిశ్చయింపవలెను భగవంతుడు ప్రతివారి యొక్క హృదయముననే దాగి అతి సూక్ష్మములైన సంకల్పములను గూడ వీక్షించుచుండ ఇక వస్తువులను గూర్చి బాహ్య కార్యములను గూర్చి వేరుగ చెప్పవలెనా? కావున దేవుని ఎవరును మోసగింపలేరు. ఒకవేళ మోసగించుటకు యత్నించితిరా, వారు పతనమై పోవుదురని గ్రహించుట మంచిది.

నీతి:– భగవానుడు సర్వత్ర వెలయుచున్నాడని గ్రహించి మనస్సునందు ఏ దోషమున్ను లేక నిర్మల జీవితమును గడపవలెను.

ప్రముఖాంధ్ర రజతోత్సవ సంచికకు ఎదురుచూడండి

**ఈ 2019వ సంవత్సరంలో ప్రముఖాంధ్రకు 24 ఏళ్ళు పూర్తయ్యి 25వ సంవత్సరంలోకి అడుగిడింది.
ఈ సందర్భంలో ఒక ప్రత్యేక సంచికను తీసుకురావాలని సంకల్పించాం. శ్రీగోటేటి శ్రీరామారావుగారి మానస పుత్రిక,
ఆయన నిరంతరం శ్రమించి వయోభారాన్ని కూడా లెక్కచెయ్యకుండా ఆయన తెలుగువారి పట్ల, తెలుగు భాష పట్ల పడిన
తపన, తపః ఫలమే ఈ ప్రముఖాంధ్ర. రజతోత్సవ ప్రత్యేక సంచికకు ప్రముఖాంధ్రుల విశేషాలను త్రిలింగదేశంలో విరాజిల్లిన
ధార్మిక సంస్కృతిని, విపులంగా, మే మెరిగినంత విశదంగా, చిత్తరవులతో మీమీ అమూల్య రచనలను,
ఈ 24 సంవత్సరాలలో ప్రముఖాంధ్రలో మీరు పొందిన అనుభవాలు పంపించండి. అంతేకాదు మీరు కూడా
చందాదారులుగా రూ.2116ను పంపిస్తూ మీరు మరొక్కరిని ఇంకో రూ.2116లను చేర్పించగలరని ఆశిస్తున్నాను.
ప్రపంచమంతా ప్రముఖాంధ్రుల మయం కావాలి. ప్రముఖాంధ్ర తేజం ప్రపంచమంతటా వెల్లివెరియాలి.**

జీ.వి. రావ్ పేజీ
(గోటేటి వేంకటేశ్వరరావు)

సత్యాన్నే అంటిపెట్టుకుని ఉంటే విజయం సాధించగలం.
ఆలస్యమైనప్పటికి విజయం సాధించే తీరుతాం
- స్వామి వివేకానంద

శ్రీగురోస్సదృశం దైవం శ్రీగురో స్సదృశః పితా!
గురుధ్యానసమం కర్మనాస్తి నాస్తి మహీతలే!

ఈ భూమిలో గురువు దేవునితో సమానం. గురువు తండ్రికన్నా ఎక్కువ. గురువుని స్మరించుకుంటే వేరే ధ్యానము లేదు అంటారు. గురువు మనిషికి అతి ముఖ్యమైన గురువులలో మొదటి గురువు తల్లి, రెండవ గురువు తండ్రి మూడో గురువు విద్యాభ్యాసము చేయించినవారు. వీరుకాక మంత్రదీక్షలు ఒసగిన గురువు. ఈ సమాజంలో మనము ఎలా నడచుకోవాలో చెప్పే మార్గదర్శి ఒక గురువు. అలా మా కుటుంబానికి శ్రీ విశ్వయోగి విశ్వంజీ గారు గురువు. ఆయన దర్శన భాగ్యం నాన్నగారికి షిరిడీ పుణ్యక్షేత్రంలో దొరికింది. తరువాత ఆయనను నేను నాన్నగారు గుంటూరులో ప్రత్యేకంగా దర్శించుకున్నాము. తరువాత మా కుటుంబమంతా ఆయనను దర్శించుకుని ఆయన అనుగ్రహాన్ని పొందాము. ఆయన ఎప్పుడు చెన్నై వచ్చినా వెళ్ళి ఆయన దర్శనం చేసుకుని నాలుగు మంచి వాక్యాలు ఆయన ద్వారా విని రావడం ఆనవాయితీ. మొన్న జూన్ ఆరో తారీఖులన ఆయన చెన్నై వచ్చారు. అదే జూన్ ఆరున (నక్షత్రం ప్రకారం) 60 ఏళ్ళు నాకు. ఉదయం కోవెలకు వెళ్ళొచ్చాక నాన్న వుండివుంటే ఎంత బాగుండు అనుకుంటున్నప్పుడు మా అన్నయ్యగారు హనుమంతరావుగారు నుండి ఫోన్, స్వామీజీ వచ్చారు అంటూ. మళ్ళీ రేపు ఉదయం బయలుదేరి వెళ్ళిపోతారని చెప్పారు. ఇంకేం ఇంటిలో అందరిని తీసుకుని మనవరాలితో సహా వెళ్ళాను. మా అందరికీ అది సంతోష దినం. ఆయనను చూసే భాగ్యం కలిగిందనే ఆనందం. అదీ నా కోసం వచ్చారా అన్నట్టు సరిగ్గా 60వ పుట్టినరోజు ఆయన ఆశీర్వాదం తీసుకోవడం మహదానందమయ్యింది. అక్కడున్నవారందరికీ నన్ను పరిచయం చేస్తూ అతనికి ఈ రోజు షష్ట్యబ్ది అతను ప్రముఖాంధ్రను నడుపుతున్నాడు. వాళ్ళ నాన్నగారు ఈ మధ్య కాలం చేసారు. నాన్నగారికి ఇచ్చిన మాట కోసం పత్రికను క్రమం తప్పకుండా తీసుకువస్తున్నాడు. ఆ పత్రిక బాగా వస్తోంది. బాగా రాస్తాడు అనేసరికి నాకు నేనూహించనిదేదో జరుగుతోంది అంటూ అచేతనుడై నిలబడిపోయాను. ఇదివరలో నేను హిందూ, హిందూత్వం గురించి రాస్తున్నప్పుడు బాగానే రాస్తున్నావు కానీ రాజకీయాలకు చోటివ్వకుండా వ్రాయి అనేవారు, కాస్తా తీవ్రత తగ్గించమనేవారు. విశ్వంజీ గురువుగారిది ప్రేమతత్వం, అందరినీ ప్రేమిద్దాం, ప్రేమతోనే గెలుద్దాం అనేవారు. ఆయన 10 సంవత్సరాల క్రితమే అమెరికా, భారతదేశం కలిస్తే గొప్పగా వుంటుందని

గోటేటి కుటుంబానికి స్వామిజి ఆశీస్సులు

పెద్ద శక్తిగా ఎదగవచ్చుని చెప్పారు. ఇప్పుడదే జరుగుతోంది. అందరిని కలుపుకుని అందరిని కలుసుకుని ఎదుగుదామన్నదే ఆయన ఆలోచన. అదే వారి అభిమతం. ఇన్నేళ్ళకు అమెరికా, భారత నాయకులిద్దరూ దానిని గుర్తించి ఒకరి అవసరాలు ఒకరు తెలుసుకుని ఒక అడుగు ముందుకు వేద్దాం అన్న దిశగా పయనించటం శుభసూచకం.

నా అరవై పుట్టినరోజున విశ్వంజీ గురువుగారిని కలుసుకుని వారి ఆశీర్వాదాలు పొందడం, నీకు ఏమి పరవాలేదు అన్నీ బాగుంటాయి అని ఆయన ఆశీర్వదించడంతో వెయ్యి ఏనుగుల బలం వచ్చింది.

✧ ✧ ✧

భారత భాగ్య విధాత

మన భారతదేశంలో దైవ నామస్మరణతోబాటుగా దానం, దయాగుణం గురించి చెప్పే నీతికథలు, కావ్యాలు వున్నాయి. ఇవన్ని ఇదివరలో నేను చదువుకున్నప్పుడు మా పాఠ్యాంశాలలో వున్నాయి. కాలక్షేపానికి కొనుక్కునే చందమామ, బాలరాజ్యం, బాలమిత్ర పిల్లల పత్రికలలోనూ వుండేవి. భక్తి సినిమాలు అప్పటిలో రాముడు, కృష్ణుడు, ప్రహ్లాదుడు, భక్త తుకారాం. భక్త కన్నప్ప ఇటువంటి సినిమాల ద్వారాను జనం ప్రభావితం అయ్యేవారు. కాని ప్రస్తుతం కాలంలో ఇవి తగ్గిపోయాయి. శ్రద్ధ చూపవలసిన ప్రభుత్వం కూడా వీటిపై శ్రద్ధ చూపకపోవడం శోచనీయం. కాని ప్రస్తుతం ఈ వాట్సప్‌ల మూలంగా నేను చూచి ఆనందించిన మూడు విషయాలు మీతో పంచుకుంటున్నాను.

1. గోవు మా తల్లి:

మనం గోవును దైవంగా తల్లిగా గోమాతగా తలిచి కొలుస్తూ వుంటాము. గోపూజలు చేస్తాము. గోశాలకు వెళ్ళి ఆకుకూరలు, పండ్లు, కాయలు సమర్పిస్తాము. గోవుని సకల దేవతా స్వరూపిణిగా పూజిస్తాం. చెన్నైకు సమీపంలో వేపంబట్టు ప్రాంతానికి చెందిన శ్రీగంగారాం అనే మహానుభావుడు పరమపదించారు. ఆయన ప్రతిదినము ఉదయం తన ఇంటి వాకిటకు వచ్చే గోవుకు ఆహారాన్ని అందించాకే ఆయన దినచర్యను ప్రారంభించేవారట. ఎప్పుడూ వచ్చే గోవు ఆయన పరమపదించిన రోజున ఆయన ఇంటికి వచ్చి నిశ్చేష్టురాలై కన్నీరు కార్చిందట. అంతేకాదు ఆ శవముతో కూడా వెళ్ళి శవదహనం అయ్యేవరకూ వుండి వెళ్ళిందట. వచ్చిన చుట్టాలు అందరూ శవ దహనం అయ్యాక బయలు దేరుతూంటే ఆ గోవు కూడా మోకరిల్లి ఆపై వెళ్ళిందట. ఉదయం నుండి మధ్యాహ్నం 2 గంటల దాకా ఆ గోవు నీరు కూడా ముట్టకుండా అక్కడే వుండి కార్యక్రమాలన్నీ పూర్తయ్యాక వెళ్ళిందట. అందుకే మన భారతీయ సంస్కృతి గోవును తల్లి తర్వాత తల్లి అని కొనియాడింది. ఈ కాలంలో సహాయం పొందిన మనుషులు కూడా చెయ్యని పనిని ఆ గోవు చేసింది. దీనిని చూసి మనం మారాలేమో? మారుతామేమో అనే చిన్న ఆశతో ఈ వార్తను మీతో పంచుకుంటున్నాను.

రాము తాతయ్యగారి - వళ్ళి టిఫిన్ సెంటర్:

1965లో మధుర సెంట్రల్ బస్ స్టాండు ప్రక్కన తన భార్య పురం దమ్మాళ్‌తో ఒక చిన్న టిఫిన్ సెంటర్ ప్రారంభించాడు ముత్తాత. మొదట కొన్ని రోజులు ఇడ్లీ, వడ మాత్రమే అమ్మేవారు. 10 నయాపైసలకు రెండు ఇడ్లీలు. కొంతకాలమయ్యాక రూపాయి పావలాకు (రూ.1.25లు) మధ్యాహ్న భోజనం కూడా పెట్టడం ప్రారంభించాడు. ఇది అక్కడుండే పేదలకు, మధ్య తరగతి వారికి చాలా ఉపయోగకారిగా వుండేదట. ప్రస్తుతం ఇక్కడ ఒక భోజనం ఖరీదు 10 రూపాయలు. ఈ పది రూపాయలకు ఒక కూర, రసం, మజ్జిగ, అన్నం శుచిగా శ్రభంగా పెడతారట ఈ తాతగారు. ఈ 50 సంవత్సరాలు ఇదొక సేవగా చేస్తున్నాడే తప్ప వ్యాపార దృక్పథంతో కానే కాదట. ఈయన చుట్టూ వున్న మిగిలిన షాపులవారు కనీసం ఈయనకు నాలుగింతల రేట్లతో అమ్మకాలు జరుపు తున్నా ఈయన మాత్రం 10 రూపాయలకు మించి ఎవరి దగ్గర తీసుకోవడం లేదు. 2015లో ఆయన భార్య చనిపోయినా భార్యకు ఇచ్చిన మాట ప్రకారం ఆయన షాపుని నడిపిస్తూనే వున్నారు. ఒక రోజుకు 30 కేజీల బియ్యం, 5 లీటర్ల సాంబార్, 4 లీటర్ల రసం, 3 కేజీల కూరగాయలు వంటకు కొంటారీ తాతగారు. భోజనానికి 10 రూపాయల కన్నా ఎవరన్నా ఎక్కువిచ్చినా తీసుకోని మహానుభావుడు. ఈయన చేస్తున్న ఈ సేవ చూసి చాలామంది దాతలు ఆయనకు విరాళాలిచ్చిన ఎంతవరకు అవసరమో అంతవరకే తీసుకుంటారట. ఆ క్యాంటీన్‌కు ఓ చిన్న స్థలం వుంది. దాని అద్దె నెలకు 500 రూపాయలు. ఆయన దినచర్య ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు వచ్చినవారికి వండి వార్చటమే. ప్రతిరోజు 11 గంటల నుండి 3 గంటల వరకు దరిదాపుగా 300 మంది భోజనం చేస్తారుట. ఈ క్యాంటీనుకు పనివారెవ్వరూ లేరు. 2015లో భార్య చనిపోయాక ఆ భార్య స్నేహితురాలు ఈ తాతకు సహాయం చేస్తుండేదట. మొన్నీమధ్య వంట్లో సుస్తీ చేసి వారం రోజులు క్యాంటీన్ తెరవకపోయేసరికి అందరూ వెళ్లి ఆయన్ను పలకరించి తోచిన సహాయం చేశారుట. ఈ 85 ఏళ్ళ వయస్సులో భార్యకిచ్చిన మాట ప్రకారం క్యాంటీన్ నడుపుతున్న మహానుభావుడు రాముతాత.

ఇక మూడవ అద్భుతం అత్తివరదర్:

ఈ వాట్సప్ పుణ్యమా అని ఈ మహాద్భుతాన్ని మనందరం తెలుసుకునే భాగ్యం కలిగింది. ప్రతి నలభై సంవత్సరాలకు ఒకసారి ఈ అత్తివరదర్ 48 రోజులు పాటు దర్శనమిస్తారు. ఈ అత్తివరదర్ రూపం అత్తిపండు చెట్టు కొమ్మతో చేసినది. ఈ విగ్రహం నలభై సంవత్సరాలు కోవెల కొలనులోనే వుండటం, నలభై సంవత్సరాల తరువాత బయటకు తీసి 48 రోజులపాటు పూజలు చెయ్యటం మహాద్భుతం. ఆయన దర్శన భాగ్యం నేను మొదటి రోజునే పొందాను. అదీ అదృష్టంగా భావిస్తున్నాను. ఇవిగో నాకు వచ్చిన విశేషాలను మీతో పంచుకుంటు న్నాను. 40 ఏళ్ళకు ఒకసారి దర్శనమిచ్చే కంచి శ్రీ అత్తి వరదరాజ స్వామివారి పూర్తి విశేషాలు

శ్రీ అత్తి వరదరాజ స్వామి విశేషం

తమిళనాడు రాష్ట్రంలోని కాంచీపురం ఆలయాల నగరంగా ప్రసిద్ధి పొందింది. సుమారు 1000కి పైగా ఆలయాలు కలిగి ఉన్న క్షేత్రం కంచి. దక్షిణపథంలో ఉన్న ఏకైక మోక్షపురి కాంచీపురం (కంచి).

కంచి లో గల ప్రసిద్ధి చెందిన దేవాలయాలలో శ్రీ వరదరాజ స్వామి దేవాలయం ఒకటి. 108 దివ్యతిరుపతులలో ఒకటై ప్రధానమైన వైష్ణవ దివ్యక్షేత్రాలలో ఒకటిగాను విరాజిల్లుతోంది.

(కంచి దర్శించిన తెలుగువారికి శ్రీ వరదరాజ స్వామి దేవాలయం అనేదానికన్నా బంగారు వెండి బల్లులు ఉన్న ఆలయం అంటే త్వరగా గుర్తుకువస్తుంది)

ఈ ఆలయంలోని విశేషం శ్రీ అత్తి వరదరాజ స్వామి.

పురాణ కాలంలో చతుర్ముఖ బ్రహ్మ గారు దివ్యమైన యాగ సమయంలో దేవశిల్పి అయిన విశ్వకర్మచే అత్తి చెట్టు కాండంతో శ్రీవరదరాజ స్వామి (వరములను ఇచ్చునట్టి శ్రీనారాయణుని) విగ్రహాన్ని చేయించి ప్రతిష్టించారు. ఈ మూర్తికి యుగాలుగా అర్చనాదులు జరుగుతూ వస్తున్న క్రమంలో తురుష్కులు కంచి పై దండెత్తి దేవాలయాలను కూల్చి సంపదలను దోపిడి చేస్తున్న సమయంలో శ్రీవారి మూర్తికి హాని కలుగకుండా వుండేందుకై ఆలయంలోని ఆనంద పుష్కరిణిలో నీరాళి మంటపం పక్కగా చిన్న మండపం యొక్క అడుగుభాగంలో ఉంచారట. లోపలికి నీళ్లు చేరని విధంగా జాగ్రత్తలు తీసుకుని వెండి పెట్టెలో ఉంచి కోనేటి అడుగున భద్రపరచారట. తదనంతర కాలంలో అంతా పరిస్థితి సర్దుకున్నాక కూడా కారణాంత రాల వల్ల గర్భాలయంలో వేరొక దివ్య మూర్తిని ప్రతిష్టించారు

అయితే పుష్కరిణి అడుగున పెట్టెలో భద్రపర్చబడిన శ్రీఅత్తి వరదరాజ స్వామిని 40 సంవత్సరంలకు ఒకసారి బయటకు తీసి వసంత మండపంలో ఉంచి 48 రోజులు భక్తులకు దర్శనం కల్పిస్తారు.

చివరిగా 1979 లో దర్శనం ఇచ్చిన శ్రీ అత్తి వరదరాజ స్వామి ఈ సంవత్సరం అంటే 2019 జులై 1 వ తేదీ నుండి ఆగస్ట్17 వ తేదీ వరకు తిరిగి దర్శనం ఇవ్వనున్నారు.

మొదటి 38 రోజులు శయన (పడుకున్న) భంగిమ లోను చివరి 10 రోజులు స్థానక (నిలుచున్న) భంగిమ లోను దర్శనం ఇస్తారు. మీరు చూసి తరించండి.